తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
29-03-2026
ఆదివారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 62
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

## పెద్ది కోసం వెనక్కి తగ్గిన అయ్యగారు!


అక్కినేని అఖిల్ హీరోగా, మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వంలో 'లెనిన్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సితార నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా వాస్తవానికి మే 1వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. అయితే, తాజాగా ఈ సినిమా రిలీజ్ పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' ఏప్రిల్ 30వ తేదీన రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో ఆ సినిమాని సెలబ్రేట్ చేసుకోవడమే కరెక్ట్. అక్కినేని అఖిల్‌కి రామ్ చరణ్‌తో మంచి అనుబంధం ఉంది.



8



# మూసీని అడ్డుకుంటే శివతాండవమే



- ప్రజలే అడ్డుకున్న వారికి బుద్ధి చెబుతారు
- మూసీ కాలుష్యాన్ని నిర్మూలనే మా లక్ష్యం
- దేవుడు మాకిచ్చిన అవకాశంగా చూస్తున్నాం
- మంచిరేవులలో ఓంకారేశ్వరాలయ శంకుస్థాపనలో సిఎం రేవంత్

**రంగారెడ్డి,మార్చి28, సిరి న్యూస్‌టుడే:** రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం సరికాదని, ఆరు నూరైనా.. అక్కడి సూర్యుడు ఇక్కడ ఉదయించినా ఈ ప్రాజెక్టు ఆగదని తేల్చి చెప్పారు. శనివారం రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అలాగే చేవెళ్లలోని

మిగతా 2వ పేజీలో..

### అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

3

## తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు



- గత పదేళ్లలో క్రీడలను పట్టించుకోని ప్రభుత్వం
- ఎల్బీ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడలను ప్రారంభించిన సిఎం

**హైదరాబాద్,మార్చి 28, సిరి న్యూస్‌టుడే:** ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌ను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. తమ కేబినెట్‌లోనూ మంచి క్రీడాకారులు ఉన్నారన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారికి క్రీడలు ఓ ఉపశమనం అని సీఎం చెప్పుకొచ్చారు. తెలంగాణ ఒకప్పుడు క్రీడల రాజధానిగా ఉండేది. కానీ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కనుమరుగైందన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 'యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు యత్నిస్తున్నాం. ఫామ్‌హౌస్‌లు, పబ్బులు వంటివాటికి యువత దూరంగా ఉండాలి. బీఆర్ఎస్ ఆలోచనలు ఫామ్‌హౌస్‌లు, పబ్బుల్లో పార్టీలు, విందులే' అని ప్రతిపక్ష పార్టీపై విమర్శలు గుప్పించారు

మిగతా 2వ పేజీలో..

### ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

- అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం
- మెట్రో విస్తరణకు మార్గం సుగమం
- తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్

2




## అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

- నెయిడా జేవర్‌లో దేశంలోనే అతిపెద్ద విమానాశ్రాయం
- ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ
- నోయిడా మూఢనమ్మకాన్ని చెరిపేసామని వ్యాఖ్య
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం పడకుండా చర్యలు

**న్యూఢిల్లీ,మార్చి 28, సిరి న్యూస్‌టుడే:** మరో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. జెవర్‌లో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించారు. ఈసందర్భంగా మోడీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు రాజకీయ నేతలు వదిలేసిన

మిగతా 2వ పేజీలో..


## భద్రాచలంలో గవర్నర్ దంపతులు

- భద్రగిరి మార్ట్ ను ప్రారంభించిన శుక్లా



**భద్రాచలం,మార్చి 28, సిరి న్యూస్‌టుడే:** భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీ రాముని పట్టాభిషేక మహోత్స వాన్ని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా దంపతులు తిలకించారు. బద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా సాగింది. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ఆయన సతీమణి

మిగతా 2వ పేజీలో..



### అట్టహాసంగా శ్రీరాముడి మహా పట్టాభిషేకం

3



2

### కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

- అవినీతిని పట్టుకోవడంలో సిఎం రేవంత్ విఫలం
- కవితకు ప్రజాదరణ ఉంటే ఆదరిస్తారు
- మీడియాతో కేంద్రమంత్రి బండి సంజయ్

## పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

- నియామకాల్లో తీరని జాప్యం
- ఆర్టీసీ, బిసి, సంక్షేమంలోనూ అదే వైఖరి
- అసెంబ్లీ నుంచి బిఆర్ఎస్ వాకౌట్

**హైదరాబాద్,మార్చి28, సిరి న్యూస్‌టుడే:** పోలీసులు, ఆర్టీసీ, బీసీ సంక్షేమంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. అంతకుముందు హరీశ్‌రావు మాట్లాడుతూ.. పోలీస్ నియామకాల్లో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడు అయితే ఎక్కడున్నా లడ్డూ వస్తుందని అంటారు..

మిగతా 2వ పేజీలో..



## కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

- డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ జగదీశ్ రెడ్డి

2



## అక్రమ మైనింగ్‌లపై సభలో దుమారం

- మైనింగ్ అంశంపై దద్దరిల్లిన శాసనసభ
- అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి
- 2014 జూన్ నుంచి మైనింగ్‌పై విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన
- పద్దులకు శాసనసభ ఆమోదం

3



# మూసీని అడ్డుకుంటే శివతాండవమే

**మొదటిపేజీ తరువాయి**

ఎంకేపల్లి వద్ద ఆధునిక గోశాలకూ ఆయన శంకుస్థాపన చేశారు. కుటుంబసమేతంగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రేవంత్ రెడ్డి ప్రసంగించారు. మంచిరేవుల ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. రాజకీయ కారణాలతో మూసీ పునరుజ్జీవనాన్ని అడ్డుకోవడం ఏ సంస్కృతి అంటూ ప్రశ్నించారు.. హైదరాబాద్ నగరం మత సామరస్యానికి వేదిక. మూసీ పరీవాహకంలో చారిత్రక శివాలయాన్ని పునఃనిర్మించాలని ఈశ్వరుని ఆశీర్వాదంతో పనులు మొదలుపెట్టాం. దీనిపై పెడార్థాలు తీసి విమర్శించే వారిపై ప్రజలే శివతాండవం చేస్తారని హెచ్చరించారు. ఆరునూరైనా ఈ ప్రాజెక్టు ఆగదు.. ఇది శివదీక్ష. రామప్ప శివుడి సాక్షిగా మూసీ ప్రక్షాళన చేసి ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా తీర్చిదిద్దుతాం. ఇది ఓట్ల కోసం.. నోట్ల కోసం చేస్తున్న పని కాదు. ఇది చరిత్రలో దేవుడి ఇచ్చిన గొప్ప అవకాశం.. ప్రజల పట్ల మాకున్న చిత్తశుద్ధి. ప్రజలే మాకు దేవుళ్లు. వారి ఆకాంక్షల మేరకే చేస్తున్నాం. చరిత్రాత్మక మందిరాన్ని నిర్మించుకోవడం ఒక చారిత్రక సందర్భం. ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ పని జరుగుతోందని అనుకోవట్లేదని సిఎం అన్నారు. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇది దైవేచ్ఛతో జరుగుతున్న కార్యక్రమం. 8 ఎకరాల్లో రూ.700కోట్లతో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతానికి 1400 ఏళ్ల చరిత్ర ఉంది. ఈ చరిత్ర కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. మూసీ నది పునరుజ్జీవనం చేయాలని చాలా మంది ప్రయత్నించారు. కారణాలు ఏవైనా ఆ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. ఆ అవకాశం మనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నా అని వివరించారు.. విమర్శలు వచ్చినా, అడ్డంకులు సృష్టించినా దేవుడే వాటిని తొలగిస్తాడు. తెలంగాణ పౌరులకు నా విజ్ఞప్తి ఒక్కటే. చరిత్రను గమనిస్తే నది పరీవాహకంలోనే నాగరికత అభివృద్ధి చెందింది.

# కాళేశ్వరం అవినీతికి కెసిఆర్ బాధ్యుడు

**కరీంనగర్,మార్చి 28, సిరి న్యూస్‌టుడే:**



కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యానికి గత బీఆరఎస్ ప్రభుత్వమే కారణమని బండి సంజయ్ స్పష్టం చేశారు. మరోసారి తెలంగాణ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలి, కాళేశ్వరం ప్రాజెక్ట్ వైఫల్యం, కవిత కొత్త పార్టీ, తాజా రాజకీయ పరిణామాలపై బండి సంజయ్ తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు కేసీఆర్ అతిపెద్ద ఇంజనీర్. టోపీ పెట్టుకొని ప్రాజెక్టును డిజైన్ చేసింది ఆయనే. ఈ ప్రాజెక్టు కుంగిపోవడానికి, ప్రజా ధనం వృథా కావడానికి కేసీఆర్ నిర్ణయాలే కారణం. ప్రజలు ప్రతి విషయాన్నీ గమనించి సరైన నిర్ణయం తీసుకుంటున్నారు' అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకోవడంలో అధికార ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది. ప్రజలు సైతం ఆయన భాషపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి మరీ దిగజారిపోయి.. ప్రధాని నరేంద్ర మోదీపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయన వ్యవహార శైలి మార్చుకుంటే మంచిదని అన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించారు. ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు గుడ్లు గుర్తుకు వస్తాయి. గాడిద గుడ్లు అంటారు. ఎన్నికలు అయిపోయాక తొండలు గుర్తుకు వస్తాయి. తొక్కుడు గుర్తుకు వస్తుందన్నారు. కాళేశ్వరం గురించి ప్రస్తావిస్తూ.. ఆ ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు.. కాళేశ్వరం కూలిపోవడానికి అప్పుడున్న బీఆరఎస్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లు కలిసే రాజకీయం చేస్తారని ఆరోపించారు.

'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణకి ముఖ్యమంత్రి.. ఉత్తరాది రాష్ట్రాల నాయకుడు కాదు. ముందు మీరు ప్రకటించిన మొదలు ఆరు గ్యారంటీలు అమలు చెయ్యాలి. కేంద్రం ఏమిస్తున్నదో తెలంగాణ ప్రజానీకానికి తెలుసు. తెలంగాణ రాష్ట్రం ఖజానా పరిస్థితి బాగాలేదు.' అని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెడతారనే ప్రచారంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ..'తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు ఇది సంకేతం. ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజకీయ పార్టీ స్థాపించే హక్కు కలిగి ఉంటారు. అది వారి వ్యక్తిగత, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించింది. కవిత కొత్త పార్టీ పెట్టాలనే ఆలోచనను స్వాగతిస్తున్నాం' అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యయుతంగా ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చు.. ప్రజలకు ఉపయోగ పడితే ఆ ఆ పార్టీలను వారు స్వాగతిస్తారన్నారు.



# భద్రాచలంలో గవర్నర్ దంపతులు

**మొదటిపేజీ తరువాయి**

జానకి శుక్లా ఈ వేడుకకు హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాతలు సమర్పించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే వెంకట్రావు,గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు ఈ ఉత్సవాన్ని తిలకించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేందుకు తొలిసారి వచ్చిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు ప్రజా ప్రతినిధులు , అధికారులు ఘన స్వాగతం పలికారు. బూర్గంపాడు మండలం సారపాకలోని ఐటీసీ హెలీప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భద్రాచలం ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు, కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి గవర్నర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ ఐటిడిఎ ఆధ్వర్యంలో భద్రాచలంలో `భద్రగిరి మార్ట్ ను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రారంభించారు. మార్ట్ లో విక్రయానికి ఉంచిన గిరిజన ఉత్పత్తుల గురించి భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్, సహాయ ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ లు గవర్నర్ కు వివరించారు. గిరిజన ఉత్పత్తులను పరిశీలించి, పలు ఉత్పత్తులను గవర్నర్ దంపతులు కొనుగోలు చేశారు.

# అందుబాటులోకి మరో అంతర్జాతీయ విమానాశ్రయం

**మొదటిపేజీ తరువాయి**




ఈ ప్రాంతమే.. ఇప్పుడు ప్రపంచస్థాయి నేతలను ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉంది. నేడు దేశానికి గర్వకారణంగా నిలిచిందని మోదీ పేర్కొన్నారు. విపక్ష సమాజ్‌వాదీ పార్టీపై విమర్శలు చేశారు. ఆ పార్టీ నేతలు తమ మూఢనమ్మకాలు, పిరికితనంతో నోయిడాను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నవారు నోయిడాలో పర్యటిస్తే అది వారికి అపశకునంగా మారుతుందనే నమ్మకం ఎంతోకాలంగా ప్రచారంలో ఉంది. దానిని ఉద్దేశించే మోదీ మాట్లాడారు. గతంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికారంలో ఉన్నవారు తమ పదవులను కోల్పోతామనే భయంతో ఈ నగరానికి రావడమే మానేశారు. సమాజ్‌వాదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఓసారి నోయిడాకు వచ్చేందుకు ప్లాన్ చేసుకున్నాను. అప్పుడు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ఆందోళనకు గురయ్యారు. ఆయన రాకపోగా.. నన్నుకూడా రావొద్దని చెప్పారు. 'మోదీజీ నోయిడా వెళ్లొద్దు. వి□రు ఇటీవలే ప్రధాని అయ్యారు' అని చెప్పుకొచ్చారు. నేను వెంటనే 'ఆ ప్రాంత ప్రజల ఆశీర్వాదం కోసం వెళ్తాను. అది సుదీర్ఘకాలం దేశానికి సేవ చేసే అవకాశాన్ని ఇస్తుంది' అని నాడు బదులిచ్చాను. అసలు ఈ నమ్మకానికి 1988 జూన్‌లో పునాది పడింది. అప్పుడు వీర్ బహదూర్ సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆయన నోయిడా వెళ్లి వచ్చిన కొన్ని రోజులకే సీఎం పదవిని కోల్పోవాల్సి వచ్చింది. ఆ తర్వాత మరికొందరు సీఎంలకు అలాంటి పరిస్థితే ఎదురైంది. 1989లో ఎన్‌డీ తివారీ, 1995లో ములాయంసింగ్ యాదవ్, 1997లో మాయావతి, 1999లో కల్యాణ్ సింగ్ కూడా ఆ నగర పర్యటన తర్వాతే సీఎం కుర్చీకి దూరమయ్యారు. ఈ నోయిడాను తప్పించుకోవడానికి నేతలు చిత్రవిచిత్రమైన కారణాలు వెతుక్కునేవారు. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజ్‌నాథ్ సింగ్ కూడా నోయిడా భయాన్ని విస్మరించలేకపోయారు. నోయిడా`దిల్లీని అనుసంధానించే డీఎన్‌డీ రైల్వేను నోయిడా నుంచి కాకుండా దిల్లీ వైపు నుంచి ప్రారంభించడం గమనార్హం అన్నారు. ఇక, 2013లో ఆ నగరంలో జరిగిన ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ సమిట్‌కు నాటి ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ హాజరుకాలేదు. అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆ సమిట్‌కు చీఫ్‌గెస్ట్ అయినా కూడా యాదవ్ రాకపోవడం గమనార్హం. దాద్రి మూకదాడి బాధిత కుటుంబాన్ని నోయిడా వెళ్లి కలవలేక.. లఖ్‌నవూకే రప్పించుకున్నారాయన. అయితే యోగి ఆదిత్యనాథ్ మాత్రం నోయిడా మూఢనమ్మకాన్ని పట్టించుకోలేదు. ఆయన 2017లో తొలిసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలుమార్లు ఆ నగరంలో పర్యటించారు. ఆ తర్వాత 2022లో రెండోసారి సీఎంగా గెలిచారు. 2027లో మరో దఫా ఎన్నికలకు వెళ్లనున్నారు. ఇకపోతే పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎదురవుతోన్న సవాళ్లను భారత్ పూర్తి శక్తితో ఎదుర్కొంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు.

పశ్చిమాసియాలోని పరిస్థితిని ప్రపంచమంతా గమనిస్తోందని మోదీ అన్నారు. అక్కడ గత నెల రోజులుగా భీకర పోరు కొనసాగుతోందన్నారు. ఈ సంఘర్షణ కారణంగా.. ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తంచేశారు. అనేక దేశాల్లో నిత్యావసర సరకుల కొరత ఏర్పడిందన్నారు. ప్రతి దేశం ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. దీనినుంచి దేశాన్ని రక్షించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలు, రైతులపై యుద్ధ భారం పడకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సంక్షోభ సమయంలో కూడా ఎలాంటి అంతరాయం లేకుండా దేశంలో అభివృద్ధి కొనసాగుతోందన్నారు. ఇక, ఇలాంటి సమయంలో ప్రజలు ఐక్యతతో ఉండాలని, ప్రశాంతతను పాటించాలని మోదీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతోన్న ఇంధన సంక్షోభాన్ని ప్రస్తావిస్తూ.. ఈ విషయంపై ప్రజలను భయాందోళనకు గురిచేసే తప్పుడు ప్రచారాలు చేయొద్దని రాజకీయ పార్టీలను కోరారు. తమ ప్రభుత్వ విధానాలు.. దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటాయన్నారు. నోయిడాలోని జేవర్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో రూ.11,200 కోట్లతో ఈ విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నారు. అధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సాయంతో, 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయ రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో`లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు. కార్యక్రమంలో యూపి సిఎం యోగి, కేంద్రమంత్రి రమ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో క్రీడా స్ఫూర్తికి చర్యలు

**మొదటిపేజీ తరువాయి**



రేవంత్. ఎల్బీ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడం సహా రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహిస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి నింపుతున్నామన్న ఆయన.. వారు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. 'స్పోర్ట్స్, కల్చరల్ మీట్ `2026' పేరిట నిర్వహిస్తున్న ఈ పోటీలకు సీఎం రేవంత్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, సలహాదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్ బాల్ ఆడారు. లెమన్ అండ్ స్పూన్ పోటీలో మంత్రి కొండా సురేఖ మొదటి బహుమతి గెలుచుకోగా.. ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, రాగమయి రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. క్రీడా పోటీల ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. నిత్యం రాజకీయాల్లో మునిగి తేలుతూ, నిరంతరం సమస్యల పరిష్కారం కోసం విరామం లేకుండా పని చేసేవారికి ఇది అద్భుత అవకాశం అన్నారు. ఇక్కడ అద్భుతంగా ఆడలేకపోవచ్చు గానీ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించేందుకు ఎల్బీ స్టేడియం వేదిక అవుతుందన్నారు. ఈ మైదానంలో శిక్షణ పొందిన వారు మంత్రివర్గంలో ఉన్నారు. క్రికెట్‌లో దేశానికి వన్నె తెచ్చిన అజారుద్దీన్ మంత్రివర్గ సభ్యుడిగా ఉన్నారు. రంజీ క్రికెట్ ఆడిన వాకిటి శ్రీహరి క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు. ఒకప్పుడు క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. కానీ, తెలంగాణ ఏర్పడిన తర్వాత క్రీడా స్ఫూర్తి కరవైంది. అందుకే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చాం. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలని సీఎం కప్ పోటీలను నిర్వహించాం అన్నారు. క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తోంది. చదువుతోపాటు క్రీడల్లో ఆసక్తి పెంచుకోవాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. క్రీడా స్ఫూర్తిని నింపేందుకే ఫుట్ బాల్ దిగ్గజం మెస్సీని హైదరాబాద్ తీసుకొచ్చాం అని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు వివాదం సృష్టించే ప్రయత్నం చేశారు. మెస్సీ ఇక్కడికి వస్తే.. హైదరాబాద్ ఖ్యాతి ప్రపంచానికి తెలిసింది. ఎల్బీ స్టేడియం రాజకీయ కార్యకలాపాలకే పరిమితమైంది. దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గచ్చిబౌలి స్టేడియంను ప్రపంచ క్రీడా పోటీలు నిర్వహించేలా అభివృద్ధి చేయబోతున్నాం. బేగంపేట హాకీ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. ఫుట్ బాల్‌లో గతంలో దేశానికి మెడల్స్ తెచ్చిన వారిలో నలుగురు మన ప్రాంతానికి చెందినవారున్నారు. మళ్లీ ఆ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలని సంకల్పించాం అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# పోలీస్ శాఖపై తీవ్ర నిర్లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

కానీ ముఖ్యమంత్రి వద్దనే పోలీసు శాఖ ఉన్నప్పటికీ ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాత్రింబవళ్లు కష్టపడే వారు పోలీసులు అని.. రాష్ట్రం కోసం సమాజం పనిచేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులను కేసీఆర్ ఎంతగానో గౌరవించారని అన్నారు. 40, 50 పోస్టులను భర్తీ చేశారని తెలిపారు. కొత్త కమిషనరేట్లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల సంక్షేమంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. కొన్ని జిల్లాలకు మాత్రమే టీఏలు, డీఏలు ఇస్తున్నారని తెలిపారు. ఏడు టీఏ బిల్లులు, మూడు సరెండర్ లీవులు, ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పోలీసుల భద్రత పథకాన్ని ఒక లక్షకు మాత్రమే పరిమితం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు శాఖలో ప్రమోషన్లను పక్కనబెట్టారని హరీశ్‌రావు తెలిపారు. పోలీసులకు ఈహెచఎస్‌ను ఇంప్లిమెంట్ చేస్తలేరని పేర్కొన్నారు. 2024 తర్వాత ఇప్పటివరకు పోలీస్ రిక్రూట్‌మెంట్ చేపట్టలేదని అన్నారు. అభ్యర్థులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం కంటే 400 కోట్ల బ్జడెట్‌ను ఎందుకు తగ్గించారని హరీశ్‌రావు ప్రశ్నించారు. పెంచాల్సిన బ్జడెట్ ఎందుకు తగ్గిందని నిలదీశారు. మా ప్రశ్నలకు మంత్రి నుంచి ఎలాంటి అస్యూరెన్స్ లేదని మండిపడ్డారు. అలాగే ఆర్టీసీ ఉద్యోగులకు , కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని హరీశ్‌రావు అన్నారు. పోలీసుల టీఏలు, డీఏలు, సరెండర్ లీవులు విడుదల చేయనందుకు నిరసనగా, పోలీసుల ఆరోగ్య భద్రతా పథకంపై భరోసా ఇవ్వనందుకు నిరసనగా, పోలీసు శాఖలో ఉన్న 17వేల ఖాళీల భర్తీపై సమాధానం చెప్పనందుకు నిరసనగా, పోలీసులకు కొత్త వాహనాల విషయంలో సమాధానం చెప్పనందుకు నిరసనగా, బీసీల ఆత్మగౌరవ విషయంలో స్పష్టత ఇవ్వనందుకు నిరసనగా, బీసీ సబ్`లాన్ నిదుల కేటాయింపుపై వైఖరి చెప్పనందుకు నిరసనగా, ప్రభుత్వ ఉద్యోగులుగా ఆర్టీసీ ఉద్యోగుల అపాయింటెడ్ డేట్ చెప్పనందుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం దారుణం

**హైదరాబాద్,మార్చి28, సిరి న్యూస్‌టుడే:**

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. బడ్జెట్‌కు సంబంధించి డిమాండ్ బుక్, అవుట్ కమ్ బడ్జెట్ బుక్ ఒకేలా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారో? సర్కస్ నడిపిస్తున్నారో అర్థం కావడం లేదంటే నిప్పులు చెరిగారు. జగదీశ్ రెడ్డి వి□డియాతో చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. డిమాండ్ బుక్స్‌లో అవుట్ కమ్ బడ్జెట్ ముద్రించారని తెలిపారు. అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి తన సొంత ఆర్థిక కారణాలపై బిజీగా ఉన్నట్లు అనిపిస్తుందని విమర్శించారు. తప్పు చేసి సరిదిద్దుకోని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవుట్ కమ్ బ్జడెట్, ఈ ఏడాది గ్రాంట్స్ బుక్‌లు ఒకేలా ఉన్నాయని విమర్శించారు. గతంలో సాధించిన ఫలితాలు, ఈ ఏడాది గ్రాంట్స్‌పై ప్రభుత్వానికి స్పష్టత లేదని అన్నారు. డిమాండ్ బుక్, అవుట్ కమ్ బ్జడెట్ బుక్ ఒకేలా కాపీ పెస్ట్ చేశారని అన్నారు. ఉన్నది ఉన్నట్లు రెండు బుక్‌లు తయారుచేస్తే.. ప్రభుత్వం ఎలా నడుపుతున్నారని ప్రశ్నించారు. పవిత్రమైన అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులపై ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ఇది పొరపాటు కాదు నేరమే అని స్పష్టం చేశారు. తక్షణమే తప్పును సర్దుకొని సభకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో ఇదే విషయమై మాట్లాడతానని స్పష్టం చేశారు.

# ప్రభుత్వ ఆధీనంలోకి హైదరాబాద్ మెట్రో

- **అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం ఆమోదం**
- **మెట్రో విస్తరణకు మార్గం సుగమం**
- **తీర్మానం ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్**

**హైదరాబాద్,మార్చి28, సిరి న్యూస్‌టుడే:**

హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థలో ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న మెట్రో రైలు ప్రాజెక్టును ప్రభుత్వం పూర్తిగా తన స్వాధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రవేశపెట్టిన తీర్మానానికి సభ ఏకగ్రీవంగా మద్దతు తెలిపింది. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో మెట్రో రైలు ఇకపై పూర్తిస్థాయిలో ప్రభుత్వ ఆస్తిగా మారిపోనుంది. నగరవాసుల చిరకాల వాంఛ అయిన మెట్రో విస్తరణకు ఉన్న అడ్డంకులను తొలగించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సాహసోపేతమైన అడుగు వేసింది. మెట్రో స్వాధీన తీర్మానానికి తెలంగాణ అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో రైలును స్వాధీనం చేసుకోవడానికి సంబంధించి దాదాపు అన్ని పక్రియలు పూర్తయ్యాయి. ఈ నెల 31 నుంచి మెట్రో రైలును నడిపించేందుకు సర్కారు సిద్ధమైంది. ఈ నేపథ్యంలోనే మెట్రో రైలు స్వాధీనానికి సంబంధించి తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెట్రో స్వాధీన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. మెట్రో విస్తరణకు కేంద్రం సహకరించాలని కోరారు. విస్తరణ కోసమే మెట్రో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో మెట్రో నెట్వర్క్‌ను భారీగా విస్తరించాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రణాళికలను సిద్ధం చేసింది. అయితే ప్రస్తుతం ఫేజ్`1 ప్రైవేట్ నిర్వహణలో ఉండటం వల్ల, కొత్తగా చేపట్టబోయే ఫేజ్`2 పనులకు అనేక సాంకేతిక , చట్టపరమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం లేవనెత్తిన కొన్ని నిబంధనలను పరిష్కరించాలన్నా, మెట్రో విస్తరణ వేగంగా జరగాలన్నా మొత్తం నెట్వర్క్ ప్రభుత్వ ఆధీనంలో ఉండటం అత్యవసరమని ముఖ్యమంత్రి సభలో వివరించారు. అందుకే ఎల్ అండ్ టీ సంస్థ నుండి మెట్రో ఫేజ్`1ను 'హైదరాబాద్ మెట్రో రైల్వే లిమిటెడ' ద్వారా స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుందని వివరించారు. ఈ స్వాధీన పక్రియతో పాటు మెట్రోను నగరం నలుమూలలా విస్తరించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను ఆవిష్కరించింది. ఫేజ్`2ఏ కింద సుమారు 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గాల నిర్మాణం చేపట్టబోతుండగా, ఫేజ్`2బి కింద మరో 86.1 కిలోమీటర్ల విస్తరణ కోసం ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఈ విస్తరణ పూర్తయితే హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థ అంతర్జాతీయ స్థాయికి చేరుకుంటుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెట్రో సేవలను మెరుగుపరచడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం. ప్రభుత్వం నేరుగా నిర్వహణ బాధ్యతలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో టిక్కెట్ ధరల నియంత్రణ, మెరుగైన సౌకర్యాలు , కొత్త మార్గాల అనుసంధానం మరింత సులభతరం కానుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి ఫేజ్`2 విస్తరణకు త్వరితగతిన ఆమోదం పొందేందుకు కూడా ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తానికి, మెట్రో రైలుపై ప్రభుత్వ పెత్తనం పెరగడం వల్ల సామాన్య ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని, నగరం ప్రపంచ పటంలో ఒక అత్యాధునిక రవాణా వ్యవస్థ కలిగిన మెట్రోపాలిటన్‌గా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే అసెంబ్లీలో తీర్మానాలను ఏకపక్షంగా ఆమోదించడం సరికాదని ఎమ్మెల్యే హరీష్‌రావు పేర్కొన్నారు. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు. నష్టాలతో సతమతమవుతున్నామని, మెట్రో రైలు నిర్వహణ నుంచి తప్పుకొంటామని నాలుగైదేళ్లుగా ఎలఅండ్‌టీ సంస్థ చెబుతోంది. ఇదే విషయాన్ని గత సెప్టెంబరులో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. సుదీర్ఘ చర్చల తర్వాత ఎలఅండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న రూ.13 వేల కోట్ల రుణంతో పాటు సంస్థ ఈక్విటీ వాటా రూ.2 వేల కోట్లను చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఎలఅండ్‌టీ నుంచి మెట్రో రైలును టేకోవర్ చేసిన తర్వాత ఎలాంటి మార్పులు లేకుండానే ప్రభుత్వం కార్యకలాపాలను నిర్వహించనుంది. మెట్రో తీర్మానంపై సభలో చర్చించలేదని హరీష్ రావు అన్నారు. మెట్రో తీర్మాన ఆమోదం ఏకగ్రీవం కాదు.. ఏకపక్షం అంటూ మండిపడ్డారు.

# సచివాలయంలో ఎర్త్ అవర్

**హైదరాబాద్, మార్చి 28, సిరి న్యూస్‌టుడే:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నిర్వహించిన 'ఎర్త్ అవర్'లో శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 గంటల వరకు రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ దీపాలను పూర్తిగా నిలిపివేశారు. అదేవిధంగా సచివాలయం ప్రధాన భవనంతోపాటు, సచివాలయంలోని వివిధ కార్యాలయ భవనాలు, హాళ్లలోనూ విద్యుద్దీపాలను ఆర్పివేశారు. గివ్ యాన్ అవర్ ఫర్ ఎర్త్ అనే నినాదంతో ఎర్త్ అవర్ 2026 పాటించారు. పర్యావరణ పరిరక్షణ చైతన్యాన్ని ప్రపంచవ్యాప్తంగా నిర్వహించారు.

## మైనింగ్, ఇసుక తవ్వకాలపై
# సీబీసీఐడీ విచారణ

- రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా అన్నింటిపైనా దర్యాప్తు
- అక్రమాలను సహించేది లేదని వెల్లడి
- ప్రభుత్వ ఖజానాకు గండికొడితే ఊరుకోం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన

**హైదరాబాద్,మార్చి28, సిరి న్యూస్‌టుడే:**

మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శాసనసభలో ప్రకటించారు. సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తాం. సంతోష్‌రావు, ఆయన తండ్రి రవీందర్‌రావుపై విచారణకు ప్రభుత్వం సిద్ధం అని తెలిపారు. గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధం అని ప్రకటించారు. రాఘవ కన్‌స్ట్రక్ష□న్‌తోపాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నాం అని తెలిపారు. విచారణలో నిజాలు నిగ్గు తేల్చి శాసనసభలో నివేదిక పెడతాం. ఇసుక మాఫియా, అక్రమాలకు పాల్పడింది బీఆరఎస్ నేతలు, వారి బంధువులే. వద్దిరాజు రవిచంద్ర వంటివారిని బెదిరించి దారిలోకి తెచ్చుకున్నారు. స్వయంగా హరీశ్‌రావు తమ్ముడు మహేశ్వర్‌రావు ఇసుక మాఫియా నడిపారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఖజానాకు గండి కొడుతూ సాగే అక్రమ మైనింగ్ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభలో అత్యంత కఠినమైన వైఖరిని ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి ఎక్కడ గండి పడినా, ఖనిజ సంపద దోపిడీకి గురైనా తాము చూస్తూ ఊరుకోబోమని, అక్రమాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష సభ్యులు లేవనెత్తిన రాఘవ కన్స్ట్రక్ష□న్స్ అంశంపై ముఖ్యమంత్రి సాక్ష్యాధారాలతో సమాధానమిస్తూ, ఇప్పటికే ఆ సంస్థకు నోటీసులు జారీ చేసి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మైనింగ్ శాఖ జరిపిన విచారణలో భాగంగా రాఘవ కన్స్ట్రక్ష□న్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నుండి భారీ మొత్తంలో పన్నులు వసూలు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సినరేజ్ ఛార్జీల కింద రూ. 1,52,97,825, అలాగే పర్మిట్ ఫీజు కింద రూ. 22,25,446 మొత్తాన్ని ప్రభుత్వం ఇప్పటికే ఆ సంస్థ నుండి కట్టించుకుందని ఆయన సభకు తెలిపారు. ఎవరైనా మంత్రుల పేర్లు చెప్పుకుని లేదా రాజకీయ పలుకుబడితో పన్నులు ఎగ్గొట్టాలని చూస్తే చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ఖజానాకు రావాల్సిన ప్రతి పైసాను వసూలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో రాజీపడేది లేదని ఈ సందర్భంగా ఆయన తేల్చి చెప్పారు.

# కంచె చేను మేసినట్లుగా ఉంది

- మంత్రి కంపెనీ అక్రమాలను పట్టించుకోరా
- నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోంది
- మైనింగ్ వ్యవహారంలో హౌజ్ కమిటీకి హరీష్ రావు డిమాండ్
- హరీష్ వ్యాఖ్యలపై మండిపడ్డ మంత్రులు శ్రీధర్ బాబు, సీతక్క

**హైదరాబాద్,మార్చి28, సిరి న్యూస్‌టుడే**

అక్రమ మైనింగ్ ముఖ్యంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట□క్షన్ మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో దుమారం చెలరేగింది. అక్మ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడం లేదంటూ బిఆరఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. అసెంబ్లీలో మైనింగ్ అంశంపై మాజీ మంత్రి, బీఆరఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'కంచె చేను మేసినట్లు... రక్షకుడే భక్షకుడిలా మారినట్లు అక్రమ మైనింగ్ జరుగుతోంది' అని విమర్శించారు. నగరం నడిబొడ్డున అక్రమ మైనింగ్ జరుగుతోందని.. రాఘవ కన్స్ట్రక్ష□న్స్ నడుపుతున్న క్రషర్లకు ఎలాంటి అనుమతులు లేవని ఆయన ఆరోపించారు. క్రషర్ నడపాలంటే 8 రకాల అనుమతులు కావాలని.. కానీ నిబంధనలు పాటించకుండా నడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయలు గండిపడుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు ఇచ్చినా చర్యలు జరగడం లేదని తెలిపారు. అనుమతులు లేని క్రషర్‌ను మూసివేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు మైనింగ్ శాఖ లేఖ రాసినా ఎలాంటి చర్యలు లేవని వ్యాఖ్యలు చేశారు. ఒక క్రషర్ కంపెనీ వల్ల కాలుష్యం పెరుగుతోందని ట్వీట్ పెట్టానని.. ఈ ట్వీట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ తీవ్రంగా స్పందించారని సభలో హరీశ్ తెలిపారు. 'విచారణ జరిపిస్తారని అన్నారు మంచిదే. పొంగులేటి మంత్రిగా ఉన్నప్పుడు విచారణ జరపడం పద్ధతి కాదు. మంత్రి పదవికి పొంగులేటి రాజీనామా చేసిన తర్వాత విచారణ జరిపించాలి' అని హరీష్ రావు డిమాండ్ చేశారు. 'నాకు పొంగులేటి మంచి మిత్రుడు. ఆయన, నేను కలిసి పనిచేశాం. నాకు వ్యక్తిగత ఉద్దేశాలు లేవు. గతంలో మేం తప్పులు చేశాం కాబట్టి వి□రు తప్పులు చేస్తామనడం మంచిది కాదు. ఓబుళాపురం మైన్స్‌పై కూడా సభలో చర్చ జరిగింది. ఓబుళాపురం మైన్స్ విషయంలో హౌస్ కమిటీ వేశారు. ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డిని హౌస్ కమిటీకి హెడ్‌గా పెట్టారు. తప్పు చేయకపోతే హౌస్ కమిటీ వేయండి. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి' అంటూ హరీశ్ రావు పట్టుబట్టారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు సీరియస్ అయ్యారు. హరీశ్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలన్నారు. 'విచారణ కోరారు... జరిపిస్తామని అన్నాం.. ఇంకా ఏంటి. మంత్రి పేరు ఎలా తీసుకుంటారు. హరీశ్ రావు చేసిన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలి. మంత్రి ఎందుకు రాజీనామా చేయాలి. అడ్డగోలు ఆరోపణలు సరికాదు. హరీశ్ మాటలు రికార్డ్ నుంచి తొలగించాలి' అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. హరీష్‌రావు అసలు ఉద్దేశం ఏంటో చెప్పాలని మంత్రి సీతక్క అన్నారు. కేసీఆర్ హయాంలో 40 క్రషర్లకు పర్మిషన్ ఇచ్చారని గుర్తుచేశారు. కావాలని మంత్రి పొంగులేటిని టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా మంత్రుల పేర్లు తీస్తున్నారన్నారు. పదేళ్ల అక్రమాలపై

విచారణ చేయాలని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పదేళ్లు జరిగిన మైనింగ్‌పై విచారణ జరిపిద్దామన్నారు. పదేళ్ల అడ్డగోలుగా ఇసుక దోపిడి చేశారని ఆరోపించారు. తప్పు చేసిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ అడగడం సరికాదని.. విచారణ జరిపి తామే చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. సాండ్ మాఫియాలో దళితులను కొట్టినప్పుడు ఎందుకు హౌస్ కమిటీ వేయలేదని వివేక్ ప్రశ్నించారు.

వెంటనే మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. క్రషన్ కంపెనీకి సంబంధించి చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారని.. కానీ బీఆరఎస్ వెనక్కి పోతోందన్నారు. మంత్రి శ్రీనివాస్ రెడ్డిపై వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆ కంపెనీలో మంత్రి డైరెక్టర్ కాదని.. చైర్మన్ కాదని.. ఆ కంపెనీతో మంత్రికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాపారం ఉంటే తప్పా అని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీ తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు సభలో సంచలన కామెంట్స్ చేశారు. తన వ్యాఖ్యలు తప్పయితే ఉరిశిక్ష వేయాలని సవాల్ విసిరారు. వ్యాపారం చేయడం తప్పు కాదని... కానీ మైనింగ్ లైసెన్స్ లేకుండా క్రషర్ నడపడం తప్పన్నారు.

# అక్రమ మైనింగ్‌లపై సభలో దుమారం

- మైనింగ్ అంశంపై దద్దరిల్లిన శాసనసభ -
- అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి -
- 2014 జూన్ నుంచి మైనింగ్‌పై విచారణకు ఆదేశిస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటన -
- పద్దులకు శాసనసభ ఆమోదం

**హైదరాబాద్, మార్చి 28, సిరి న్యూస్‌టుడే:**



మైనింగ్ అంశంపై శాసనసభ దద్దరిల్లింది. పద్దులపై చర్చలో భాగంగా గనుల అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పొంగులేటిని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడిన మంత్రులు పదేళ్ల అక్రమాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లో బైఠాయించి నినాదాలు చేపట్టగా ఈ క్రమంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారు. 2014 జూన్ 2 నుంచి అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు.

నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్ : పద్దులపై చర్చలో భాగంగా అసెంబ్లీలో మైనింగ్ అంశం తీవ్ర దుమారం రేపింది. బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అనుమతులు లేకుండా క్రషర్స్ నడుపుతోందని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్ చేపడుతున్నా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. రక్షకులే భక్షకులయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తున్న అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశారు.

శాఖాపరమైన విచారణ చేపడతాం : హరీశ్‌రావు వ్యాఖ్యలను తప్పుపట్టిన మంత్రులు శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ పొంగులేటి పేరు ప్రస్తావించడాన్ని తప్పుపట్టారు. పదేళ్లలో ఇసుక, ఇతర మైనింగ్‌లో జరిగిన అక్రమాలపైనా నజర్ పెట్టాలని అమాత్యులు సూచించారు. మొత్తం వ్యవహారంపై శాఖాపరమైన విచారణ చేపడతామని గనుల శాఖ మంత్రి వివేక్ ప్రకటించారు.

సీబీసీఐడీ విచారణకు ఆదేశం : మంత్రుల సమాధానాలతో సంతృప్తి చెందని బీఆర్ఎస్ శాసనసభ్యులు అసెంబ్లీ వెల్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉపముఖ్యమంత్రి భట్టి విజ్ఞప్తి చేసినా శాంతించకపోవటంతో జోక్యం చేసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాఘవ కన్‌స్ట్రక్షన్ సహా పదేళ్లలో అక్రమ మైనింగ్ చేపట్టిన సంస్థల అవినీతిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి పొంగులేటికి రాఘవ కన్‌స్ట్రక్షన్ సంస్థతో సంబంధంలేదని సీఎం స్పష్టం చేశారు.

నిరసన మధ్యే పద్దులకు శాసనసభ ఆమోదం : పద్దులపై చర్చ, మంత్రుల సమాధానం పూర్తయినట్లు ప్యానల్ స్పీకర్ ప్రకటించారు. 8 పద్దులకు శాసనసభ ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ సభ్యుల నిరసన మధ్యే పద్దులకు ఆమోద ముద్ర వేసింది. 202526 అదనపు వ్యయ అంచనాను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. అనంతరం శాసన సభ రేపటికి వాయిదా పడింది.

# అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

- 'తొలి ముద్ద'ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, మార్చి 28, సిరి న్యూస్‌టుడే:**



తెలంగాణ రాష్ట్రంలోని అంగన్‌వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ 'తొలి ముద్ద'ను ప్రభుత్వం ప్రారంభించింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ స్కీమ్‌లో భాగంగా అంగన్‌వాడీ చిన్నారులకు రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్‌కు మొబైల్ ఫోన్‌లను రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదు : ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని గుర్తు చేశారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌కు ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉందని, కానీ న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదని తెలిపారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించామని పేర్కొన్నారు.

ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తాం : ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని కోరారు. అంగన్‌వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందన్న ఆయన, ఆ శాఖ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు : ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో అవే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు.

# గోదావరిలోకి దూకి తల్లీబిడ్డల ఆత్మహత్యాయత్నం

- వెంటనే నదిలోకి కాపాడిన మత్స్యకారులు

**భద్రాచలం,మార్చి28, సిరి న్యూస్‌టుడే:**

భద్రాచలం గోదావరి వంతెన పై శనివారం మధ్యాహ్నం తీవ్ర కలకలం రేగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన ఓ మహిళ తన చిన్నారితో సహా వంతెనపై నుంచి నదిలోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం ప్రకారం పాల్వంచకు చెందిన ఆ మహిళ శనివారం మధ్యాహ్నం తన బిడ్డతో కలిసి భద్రాచలం గోదావరి వంతెన వద్దకు చేరుకుని చిన్నారితో సహ నదిలోకి దూకింది. గమనించిన ప్రయాణికులు, స్థానికులు ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికంగా ఉన్న మత్స్యకారులు వారిని వెంటనే కాపాడారు. క్షేమంగా తల్లీ బిడ్డను బయటకు తీసుకువచ్చి భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం వారిద్దరి పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే వారి ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

## వారం రోజుల వ్యవధిలో ఇద్దరు ఉద్యోగుల మృతి

**హైదరాబాద్,మార్చి28, సిరి న్యూస్‌టుడే:**

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన, విద్యా నిర్వహణ సంస్థలో వరుస గుండెపోటు మరణాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. కేవలం వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు మరణించడం అక్కడి సిబ్బందిని దిగ్భ్రాంతికి గురిచేసింది.

తాజాగా శుక్రవారం రాత్రి అనిల్ కుమార్ అనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి మరణించాడు. బిహార్‌కు చెందిన అనిల్ కుమార్ ట్రైనింగ్ నిమిత్తం హైదరాబాద్‌లోని నార్మ్‌కు వచ్చాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఆకస్మికంగా ఛాతిలో నొప్పి అంటూ కుప్పకూలాడు. అతనికి చికిత్స అందించేలోపే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. గత ఆదివారం కూడా నార్మ్‌లో విషాదం చోటుచేసుకుంది. సైంటిస్ట్ దామోదర్ రాత్రి భోజనం చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మరణించాడు. ఇలా వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు ఉద్యోగులు గుండెపోటుతో మరణించడంతో నార్మ్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మంటలు చెలరేగి కారు దగ్ధం

**యాదాద్రి భువనగిరి,మార్చి28, సిరి న్యూస్‌టుడే:**

బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

# అట్టహాసంగా శ్రీరాముడి మహా పట్టాభిషేకం

- పులకించిన భద్రగిరి దివ్యక్షేత్రం
- స్వామివారి మహా పట్టాభిషేకానికి హాజరైన గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- సీతమ్మతో కలిసి రాజాధిరాజుగా సాక్షాత్కరించిన స్వామివారు - పట్టాభిషేక మహోత్సవంలో జగదభి రాముడి నినాదాలతో పులకించిపోయిన భక్తజనం

**భద్రాచలం, మార్చి 28, సిరి న్యూస్‌టుడే:**



భద్రాచలంలో శ్రీరాముడి మహా పట్టాభిషేకం వైభవంగా సాగింది. పరిపాలనా దక్షతతో సుభిక్ష రాజ్యాన్ని నెలకొల్పిన రాఘవోత్తముడిని భక్తజనం కొనియాడే ఉత్సవం ఆద్యంతం అట్టహాసంగా జరిగింది. వేద మంత్రోచ్చారణలు, జయ జయ ధ్వానాలు మార్మోగుతుండగా, సింహాసనాన్ని అధిష్టించిన లోకాభిరాముడు భక్త కోటికి నేనున్నానంటూ కోదండాన్ని చేతపట్టి కొండంత అభయమిచ్చాడు.

సర్వాంగ సుందరంగా మాఢవీధులు : రఘువంశ తిలకుడు, దశరథ నందనుడు, శ్రీరామ మహాపట్టాభిషేక వేడుకతో భద్రగిరి దివ్యక్షేత్రం పులకించింది. జగదేకవీరుడు, జగన్మాతను మనువాడిన దృశ్యాలు మది నిండా ఉండగా, మరుసటి రోజునే అంగరంగ వైభవంగా పట్టాభిషిక్తుడై భక్త కోటికి అభయమిచ్చాడు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో భద్రాచల మాఢవీధులు సర్వాంగ సుందరంగా మారగా, నిత్య పూర్ణాహుతి అనంతరం దేవ దేవుడు పల్లకిలో మిథిలా మండపానికి చేరుకున్నారు.

భక్తుల మదిని దోచిన పట్టాభిషేక వేడుక : శ్రీరామ నామ స్మరణతో మిథిలా మండపం మార్మోగుతున్న వేళ సాగిన పట్టాభిషేక వేడుక ఆద్యంతం భక్తుల మదిని దోచింది. ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో సాగిన విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం భక్తి భావాలు పంచింది. రామరాజ్యంలో ప్రజాశ్రేయస్సు వర్ధిల్లిన తీరు, పాలకులకు ఆదర్శంగా నిలిచేలా అయోధ్యను పరిపాలించిన తీరును వైదిక పెద్దలు కొనియాడారు.

భక్తకోటికి కొండంత అభయం : నీరజాక్షి సీతమ్మతో కలిసి స్వామివారు రాజాధిరాజుగా సాక్షాత్కరించారు. భక్తరామదాసు తయారు చేయించిన ఆభరణాల విశిష్టతను వివరిస్తూ స్వామికి అలంకరించిన తీరు భక్తులకు పరమానందాన్ని కలిగించింది. ఖడ్గం చేతబట్టి, కిరీటాన్ని ధరించి, ఛత్ర చామరాలతో కొలువు దీరిన రాములోరిని చూసి భక్తజనం మురిసిపోయింది. వేద మంత్రోచ్ఛారణ మారుమోగుతుండగా, సింహాసనాన్ని అధిష్టించిన రామచంద్రుడు భక్తకోటికి కొండంత అభయమిచ్చాడు.

స్వామివారిని దర్శించుకున్న గవర్నర్ దంపతులు : ఈ క్రతువుకు హాజరైన గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు ముందుగా ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. దక్షిణ అయోధ్య అయిన భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకోవడం పట్ల గవర్నర్ హర్షం వ్యక్తం చేశారు. అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణ వేడుక : శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు భద్రాచలంలో అంగరంగ వైభవంగా జరిగాయి. కల్యాణ ఘట్టాన్ని వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్చకుల వేద మంత్రాలు, భక్తుల హర్షధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో మాంగళ్యధారణ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగీత దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

రూ.351 కోట్లతో భూమి పూజ : ఈ కల్యాణ మహోత్సవంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అంతకముందు భద్రాచలం ఆలయ అభివృద్ధికి తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు ముఖ్యమంత్రి భూమి పూజ చేశారు.

# హనుమాన్ శోభ యాత్రకు కూన శ్రీనివాస్ గౌడ్ కు ఆహ్వానం



**మేడ్చల్ మల్కాజ్గిరి (సిరి న్యూస్) మార్చి 28**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జీడిమెట్ల విలేజ్ లో పాత ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2 తేదీ సాయంత్రం నిర్వహించే వీర హనుమాన్ విజోత్సవ శుభ యాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిగా రావాలని షాపూర్ నగర్ లోని నివాసంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కూన శ్రీనివాస్ గౌడ్ ను . ఆహ్వానించి శాలువాతో సత్కరించే ఆహ్వాన పత్రికలు అందజేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శేఖర్ కళ్యాణ్ సాయి సందీప్ జంగారెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాలప్ప పాల్గొన్నారు

# గ్యాస్ డీలర్ ఏజెన్సీ నీ నియమించాలి

## మండల ముదిరాజ్ సమన్వయ కమిటీ డిమాండ్



**పెద్ద శంకరం పేట, మార్చి 28, (సిరి న్యూస్):**

పెద్ద శంకరం పేట పట్టణంలో గ్యాస్ డీలర్ ఏజెన్సీ నీ వెంటనే నియమించాలని మండల ముదిరాజ్ సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిటి సభ్యులు శనివారం నాడు ఒక వినతి పత్రం స్థానిక తహశీల్దారు కు సమర్పించారు. అల్లదుర్గం, నిజాంపేట్, టేక్మాల్ జోగిపేట లలో వివిధ కంపెనీ సంస్థల ఏజెన్సీ లు పని చేస్తున్నాయని, వారే ఇక్కడికే వచి గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో గ్యాస్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు రాదో తెలియని సందిగ్ధ అవస్థలో ఇక్కడి ప్రజలు ఉన్నారన్నారు. మూడు ప్రభుత్వ రంగ సంస్థల లో ఏదో ఒకటి ఇక్కడ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పున్నయ్య, శంకరయ్య, జోడు రవీందర్, గాజు వెంకటేశం, గాండ్ల సాయిలు, అశోక్ , సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

# వరకట్నం వేధింపులతో వివాహిత మృతి

**కొంపల్లి,మార్చ్-28(సిరి న్యూస్).**



వరకట్నం విధింపులతో వివాహిత ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పేట్-బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది.స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నా యి.ఆంధ్రప్రదేశ్ రాష్టంలోని ఒంగ్గోలు జిల్లా పరిసరా గ్రామంలో నివాసం ఉండే లక్ష్మి నర్సయ్య నాయుడు అక్కడే ఉండే శాంతి కుమారి తో గత 8 నెలల క్రితం ప్రేమ వివాహం జరుగగా జీవనోపాధి కోసం కొంపల్లిలోని శ్రీనివాస్ నగర్ కాలనిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ స్థానికంగా ఉన్న ఓ సంస్థలో పనిచుకుంటూ జీవిస్తున్నారు.రోజు విధులు ముగించుకొని రాగానే కట్నం విషయం తీస్తూ మానసికంగా ఇంసించేవాడని దానితో పాటు తనకు సంతానం కోసం సమస్య ఎదుర్కొంటుందని అన్నింటికీ గుర్రై 27 ఉదయం ఇంట్లో భర్త లేని సమయంలో తన బెడ్ రూమ్ లో ఫ్యాన్ కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్ట్ మార్ట్ నిమిత్తం గాంధీ హాస్పిటల్ కి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుతున్నారు.

# కళ్యాణం లో పాల్గొన్న ముఖ్యమంత్రి సోదరుడు



**సదాశివపేట. మార్చి 28. (సిరి న్యూస్)**

సదాశివపేట మండలంలోని నందికంది గ్రామంలో నిర్వహించిన శ్రీ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు ఎనుముల కృష్ణ రెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, సీడీసీ ఛైర్మన్ గడిల రామ్ రెడ్డి , మండల కాంగ్రెస్ అధ్యక్షులు సిద్ధన్న , జిల్లా సర్పంచుల ఫోరం వైస్ ప్రెసిడెంట్ ఆశీ రెడ్డి , మండలంలోని పలు గ్రామాల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులకు నందికంది గ్రామ సర్పంచ్ శ్రావంతి విజయ్ భాస్కర్ రెడ్డి , ఆలయ కమిటీ అధ్యక్షులు పేట శ్రీనివాస్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్థులు సాదర స్వాగతం పలికారు.

# మురికినీరు, దోమల బెడదతో 11, 12 వార్డుల ప్రజల ఆందోళన

- ఇండ్ల వెనుక నిల్వ నీటితో తీవ్ర అసౌకర్యం
- పందుల సంచారం, కాలుష్యంతో ఆరోగ్య సమస్యల భయం
- డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ప్రజల డిమాండ్



**గుమ్మడిదల, మార్చి 28 (సిరి న్యూస్):**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 11, 12 వార్డులలో మురికినీటి సమస్య తీవ్రరూపం దాల్చి కాలనీవాసులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇండ్ల వెనుక భాగాల్లో మురికినీరు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి, ఉదయం సమయాల్లో దోమల బెడద అధికమై జీవనం దుర్భరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరొకవైపు మురికినీటిలో పందులు తిరుగుతూ కాలుష్యాన్ని మరింత పెంచుతున్నాయి. పందుల సంచారం వల్ల పరిశుభ్రత దెబ్బతింటోందని, చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.ప్రస్తుతం కాలనీల్లో నిల్వవుతున్న మురికినీరు సమీపంలోని కుంటలోకి వెళ్తుండగా, కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ భూముల గుండా నీటిని అనియంత్రితంగా మళ్లించడం సమస్యను మరింత క్లిష్టం చేస్తోంది. ఎవరికి నచ్చిన విధంగా కాలువలను మలుపులు తిప్పడం వల్ల నీరు సరైన దారిలో పారక, తిరిగి కాలనీల్లోనే నిల్వవుతోందని ప్రజలు తెలిపారు.

**స్పందించి పరిస్థితిని పరిష్కరించండి**

ఈ పరిస్థితిపై స్పందించిన కాలనీవాసులు, 11వ వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ మరియు 12వ వార్డు కౌన్సిలర్ తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా శాశ్వత పరిష్కారంగా సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, మురికినీరు ఎక్కడా నిల్వ కాకుండా సరైన మార్గంలో వెళ్లేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా మురికినీటి ప్రవాహానికి ప్రత్యేక మార్గాన్ని కేటాయించి, అక్రమంగా కాలువలను మళ్లించే చర్యలను నియంత్రించాలని సూచిస్తున్నారు. కాలనీలో పరిశుభ్రతను కాపాడేందుకు పందుల సంచారాన్ని అరికట్టడంతో పాటు దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని, లేదంటే ప్రజల ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందని కాలనీవాసులు వాపోతున్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో గ్రామాల సమగ్ర అభివృద్ధి

- 99 రోజుల కార్యాచరణపై సర్పంచులతో సమీక్ష
- ఏప్రిల్ 2 న అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలి
- గ్రామ సభల ద్వారా ప్రజా సమస్యలకు పరిష్కారం దిశగా అడుగులు





**గుమ్మడిదల, మార్చి 28 (సిరి న్యూస్):**

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగితే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని గుమ్మడిదల మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. శనివారం మండల అభివృద్ధి కార్యాలయంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక పేరిట చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 8 గ్రామ పంచాయతీల సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గ్రామ స్థాయిలో అభివృద్ధి వేగవంతానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా గుర్తించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవడం, సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరవేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు.ముఖ్యంగా ప్రభుత్వ విద్య, ఆరోగ్యం, పారిశుధ్యం, తాగునీటి సరఫరా వంటి ప్రాధాన్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల హాజరు పెంపు, మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థాయి నాయకులు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. అలాగే ఆంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాల సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 2వ తేదీన మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ రహదారులు, కాలువలు, వీధి దీపాలు, చెత్త నిర్వహణ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా పారదర్శకత, బాధ్యతాయుత పాలనను అమలు చేయాలని సూచించారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి గ్రామాల అభివృద్ధిలో గుమ్మడిదల మండలాన్ని ఆదర్శ మండలంగా ముందుకు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో మండల తహసీల్దార్ పరమేశం, ఎంపీఈవో దయాకర్ రావు, సర్పంచులు సామాల మహిపాల్ రెడ్డి, కొమ్ము శీను, విజయభాస్కర్, పెంటారెడ్డి, రాణి, దుర్గా, మంజుల, లావణ్యతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నృత్యాన్ని ప్రభావితం చేసే వేదిక

- నృత్యానికి, స్థలానికి మధ్య సంబంధాన్ని విశ్లేషించిన డాక్టర్ మల్లాది సంప్రీతి



**పటాన్ చెరు, మార్చి 28, (సిరి న్యూస్):**

నృత్యం యొక్క శారీరక సౌందర్యం నిర్మిత రూపంతో లోతుగా ముడిపడి ఉందని, ఇక్కడ వేదిక కొలతలు, అనుభవ పూర్వక అమరికలు ప్రదర్శనను గణనీయంగా ప్రభావితం చేస్తాయని వివిధ రంగాలలో నిష్ణాతురాలు, కళాకారిణి డాక్టర్ సంప్రీతి మల్లాది వెల్లడించారు. హైదరాబాదు లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో 'అంతరిక్షంలోనా లేక వేదికపైనా? భారతీయ నర్తకుల ప్రదేశాల ప్రతిధ్వనులను అన్వేషించడం' అనే అంశంపై శనివారం ఆమె ఆతిథ్య ఉపన్యాసం చేశారు. తన ఉపన్యాసంలో, డాక్టర్ మల్లాది భారతీయ ప్రదర్శన సంప్రదాయాలపై తాను చేసిన విస్తృత పరిశోధన ఆధారంగా, నృత్యానికి, స్థలానికి మధ్య పరిణామం చెందుతున్న సంబంధాన్ని విశ్లేషించారు. ప్రాదేశిక సందర్భాలు శారీరక అభ్యాసాలను ఎలా రూపొందిస్తాయో, వాటిచే ఎలా ప్రభావితమవుతాయో ఆమె వివరించారు. ఈ క్రమంలో, వేదిక గురించిన సాంప్రదాయ అవగాహనను మించిన ఒక దృక్కోణాన్ని ఆమె అందించారు. వాస్తు పరమైన స్థలాలు చట్టబద్ధతను కల్పించే శక్తులుగా పనిచేస్తాయని, చారిత్రాత్మకంగా, నృత్యం, ప్రాదేశిక రూపకల్పనల సమ్మేళనం వాస్తుశాస్త్ర పరిణామంలో అంతర్భాగంగా ఉందని డాక్టర్ మల్లాది పేర్కొన్నారు. నృత్యం, ప్రదేశానికి సంబంధించిన భావనాత్మక, సాహిత్యపరమైన వ్యాఖ్యానాలు, జీవన, తాత్కాలిక ఆచరణలతో నిరంతరం సంభాషిస్తూనే ఉన్నాయన్నారు. ఇవి తరచుగా సంస్థాగత, ప్రభుత్వ ప్రయోజనాలతో ముడిపడి, వాటిచే నియంత్రించబడతాయని పేర్కొన్నారు. ప్రొసీనియం వేదిక దూరం, దృశ్యమానత, హావభావాలను పునర్ నిర్వచించినట్టే, సాంప్రదాయ సభలు కూడా ప్రదర్శకులను, ప్రదర్శనలను తీర్చిదిద్దిన సాంస్కృతిక సంరక్షకులుగా వాటి పాత్రను డాక్టర్ మల్లాది మరింతగా వివరించారు. ఈ చర్చను డిజిటల్ యుగానికి విస్తరిస్తూ, నేటి దృశ్యమానత అనేది అల్గారిథమిక్ విస్తరణ, దృశ్య ఆకర్షణ, పునరావృతమయ్యే స్వభావం, ప్లాట్ ఫామ్ సౌందర్యం వంటి వాటిచే ఎక్కువగా నియంత్రించబడుతోందని, తత్ఫలితంగా కొన్ని అత్యంత స్పష్టంగా కనిపిస్తుండగా, మరికొన్ని అట్టడుగున ఉండిపోతున్నాయని ఆమె గమనించారు.విఈ కార్యక్రమాన్ని లలిత, ప్రదర్శన కళల విభాగం సమన్వయకర్త డాక్టర్ వై. లలిత సింధూరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యా పకులు, విద్యార్థులు ఆఫ్ లైన్, ఆన్ లైన్ (హైబ్రిడ్) పద్ధతిలో చురుకుగా పాల్గొన్నారు. ఇది ప్రదర్శన, ప్రాదేశిక అధ్యయనాల సంగమంతో బలమైన విద్యాపరమైన అనుబంధాన్ని ప్రతిబింబించింది.

# ష్ణు ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థులు



**నర్సాపూర్ మార్చి 28 (సిరి న్యూస్)**

విష్ణు ఉన్నత పాఠశాల ఆడిటోరియంలో శనివారం యూ.కే.జీ. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి.వి.ఆర్.ఐ.టి కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబె పాల్గొన్నారు 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు సాధించిన విజయాలను, నైపుణ్యాలను గుర్తించి విద్యార్థులకు సర్టిఫికెట్ బహుకరించారు వారిని ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించి, పాఠశాల వార్షిక నివేదికను నివేదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులు నాటికలు,మరి కొంత మంది నృత్యాలు ప్రదర్శించి అందరిని ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో మంచి ప్రదర్శన కనబరిచినందుకు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో, వైసర్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ , బాపిరాజు , సురేష్ పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి , వైస్ ప్రిన్సిపల్ విశ్వనాథ్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అతిథుల, ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు సర్టిఫికెట్లను , బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేయడం జరిగింది

# గొప్ప దైవ భక్తుడు ఎమ్మెల్యే జిఎంఆర్





- పటాన్ చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మి సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్ర స్వామి ఆలయానికి 75 లక్షల భారీ విరాళం
- నేటి వరకు సొంత నిధులతో 210 కు పైగా దేవాలయాల నిర్మాణం
- ప్రతి ఒక్కరిలో భక్తి భావం , మత సామరస్యాన్ని పెంపొందించడమే మా లక్ష్యం
- ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు , మార్చి 28, (సిరి న్యూస్):**

ఒక వైపు అభివృద్ధిలో మరో వైపు ఆధ్యాత్మికలో పటాన్ చెరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రతీకగా నిలుపుతూ నేటితరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తున్నారు పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. నియోజకవర్గంలో ఏ గ్రామంలో నైనా గుడి, మసీదు, చర్చి నిర్మిస్తే తన వంతు సహకారాన్ని అందిస్తూ ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంపొం దిస్తున్నారు. తాజాగా పటాన్ చెరు ఏపీఆర్ లో నిర్మిస్తున్న శ్రీశ్రీశ్రీ విశాలక్ష్మి సమేత కాశీ విశ్వనాథ స్వామి, శ్రీ సీతా సమేత కోదండ రామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి 75 లక్షల రూపాయల భారీ విరాళం అందించారు. శనివారం ఆలయంలో ఏర్పాటు చేసిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 75 లక్షల రూపాయల విరాళానికి సంబంధించిన చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మతాలు వేరైనా మనుషు లందరూ ఒక్కటేనని.. మానవత్వం, ప్రేమ, శాంతి, మరియు సోదరభావం మతాల మూల సూత్రమని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ధర్మాన్ని కాపాడుకుంటూ.. పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే గత 20 సంవత్సరాలుగా పటాన్ చెరు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత నిధులతో 210 కి పైగా దేవాలయాలు, వందకు పైనా మసీదులు, ఆశీర్ఖానాలు, 30 కి పైగా చర్చిలు నిర్మించి పరమత సహనానికి ప్రతీకగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దినట్లు తెలిపారు..దైవం పట్ల అచంచల విశ్వాసం, నిష్కామ కర్మ, మరియు క్రమశిక్షణతో కూడిన జీవనం ప్రతి ఒక్కరిలో భక్తి భావాన్ని పెంచుతాయని అన్నారు. కుల, మత, వర్గ విభేదాలను మర్చిపోయి, మానవుడిగా ప్రతి ఒక్కరూ సన్మార్గాన్ని అనుసరించడమే నిజమైన భక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, చిన్న మధు, ప్రభాకర్, సందీప్ రెడ్డి, అశోక్, వెంకటేష్, రాజు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల పై పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- రోడ్డు ప్రమాదాలను నివారించాలి
- మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ ప్రతినిధి,మార్చి28(సిరి న్యూస్)**



రోడ్ల పై పెండింగ్ పనులు పూర్తి చేసి రోడ్డు ప్రమాదాలు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో రోడ్ సేఫ్టీ, మత్తు పదార్థాల నిర్మూలనపై సమావేశ నిర్వహించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డుపై ప్రయాణించే ప్రతి ఒక్క వాహనదారుడు సకాలంలో క్షేమంగా ఇంటికి చేరాలన్నారు.రోడ్ల పై పెండింగ్ లో ఉన్న సి సి కెమెరాలు సిగ్నల్స్ విద్యుత్ దీపాలు సైన్ బోర్డులు, గుంతలు పూడ్చి పెండింగ్ పనులు లేకుండా చూడాలన్నారు.విద్యాసంస్థల్లో, కళాశాలలో రోడ్డు భద్రత నియమాల గూర్చి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నందున వాహన దారులు నియమాలు పాటించడం, హెల్మెట్ ధరించడం, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండడం, రోడ్ల పై ఉన్న వివిధ సిగ్నల్, మార్కింగ్ గురించి తెలుసుకొని జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు.మత్తు పదార్థాలపై నిఘా పెంచాలన్నారు. మత్తుకు అలవాటు పడి యువకులు భవిష్యత్తు కోల్పోకుండా చూడాలన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలు నివారించవచ్చని, విద్యాలయాల్లో,మెడికల్ షాపుల్లో, పరిశ్రమలలో నిరతరం మత్తు పదార్థాలపై నిఘా పెట్టామన్నారు. మత్తు తో జీవితాలు చిత్తు అయిపోతాయన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, డి ఎస్పీ లు, మున్సిపల్ కమిషనర్లు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హల్ది ఫంక్షన్ లో ఫుడ్ పాయిజన్

- ఫుడ్ పాయిజన్ తో 41 మందికి అస్వస్థత
- ఆస్పత్రిలో చేరిక
- చికిత్స అందించిన వైద్యులు

**నర్సాపూర్ మార్చి 28 (సిరి న్యూస్)**





హల్దీ ఫంక్షన్లో ఫుడ్ పాయిజన్ తో 41 మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన సంఘటన నర్సాపూర్ పట్టణంలో జరిగింది ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయిపట్టణానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబానికి చెందిన హల్ది ఫంక్షన్ శుక్రవారం జరిగింది ఈ ఫంక్షన్ కు పలువురు కుటుంబ సభ్యులు హాజరై ఆ ఫంక్షన్ లో భోజనం చేశారు అనంతరం రాత్రి 12 గంటల సమయంలో సుమారు 41 మందికి వాంతులు విరోచనాలతో అస్వస్థతకు గురి కావడంతో ఇది గమనించిన పలువురు శుక్రవారం రాత్రి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు వారిని ఆసుపత్రిలో చేర్చుకున్న వైద్యులు చికిత్సలు అందించారు అందులో ఇద్దరు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు ఈ విషయమై ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ ఇండెంట్ పావని మాట్లాడుతూ ప్రస్తుతం అందరి పరిస్థితి మెరుగుపడిందని అందులో ఇద్దరు చిన్నారుల మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు ఈ విషయమై డి ఎం హెచ్ కు సమాచారం ఇవ్వగా ఆయన ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ హెల్ది ఫంక్షన్ జరిగిన ప్రాంతానికి వచ్చి శాంపిల్ సేకరించారని ఆమె తెలిపారు

# వీధిదీపాల సమస్య పరిష్కారానికి చర్యలు వేగవంతం

- కౌన్సిలర్ ఆధ్వర్యంలో విద్యుత్ పనులు ప్రారంభం

**గుమ్మడిదల, మార్చి 28( సిరి న్యూస్):**



గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులో నెలకొన్న వీధిదీపాల సమస్యను పరిష్కరించేందుకు మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. స్థానిక కౌన్సిలర్ ప్రమీల ఆధ్వర్యంలో సుమారు 12 విద్యుత్ స్తంభాలకు కొత్తగా వీధి దీపాలు అమర్చేందుకు వైర్లు బిగించే పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సిహెచ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ముఖ్యంగా వీధిదీపాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి వార్డులో తక్షణ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. స్థానిక కౌన్సిలర్ పొన్నాల ప్రమీల మాట్లాడుతూ వార్డులో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రవీందర్, కౌన్సిలర్లు కత్తుల రమేష్, సురభి కుమార్ గౌడ్, శ్రీ చూర్ణం చక్రపాణి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సరెడ్డి గారి వెంకట్రాంరెడ్డి, శంకర్, ఆంజనేయులు, ఫయాజ్ తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## తూప్రాన్ గీతా స్కూల్ యాజమాన్యానికి విద్యా పురస్కారం




**తూప్రాన్ మార్చ్ 28 సిరి న్యూస్**

తూప్రాన్ పట్టణంలోని గీత స్కూల్ కు శనివారం రోజు విద్యా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న తూప్రాన్ గీతా స్కూల్ యాజమాన్యానికి హెచ్. ఎం. టీవీ మరియు హన్స్ ఇండియా వారి "విద్యా పురస్కారం లభించిందిగత మూడు దశాబ్దాలుగా నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు నైపుణ్యం విలువలతో కూడిన విద్య వ్యక్తిగత వికాసం క్రమశిక్షణ మరియు సృజనాత్మకత లాంటి అంశాల్లో వేలాది విద్యార్థులను తీర్చిదిద్దినందులకు గీతా హై స్కూల్ కు ఈ అవార్డు లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పి రామాంజనేయులు తెలిపారు ఈ రోజు హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని ఆర్. టీ. సి కళా భవన్ లో జరిగిన అవార్డుల కార్యక్రమంలో రాష్ట్ర రవాణా మరియు సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారి చేతుల మీదుగా పాఠశాల కరెస్పాండెంట్ రామాంజనేయులు తో పాటు చైర్ పర్సన్ పి. ఉష, డైరెక్టర్ భరత్ లు ఈ అవార్డు అందుకున్నారు ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు బి రాఘవేందర్ గౌడ్ కే నారాయణ గుప్త మౌనిక ఇంచార్జి ప్రిన్సిపాల్ ప్రేమ్ రాజ్ వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వర్ మరియు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేసారు

## సీఎం సహాయ నిధి పేదల ఆరోగ్య ప్రదాయిని

! పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**కొండాపూర్ మార్చి 28 (సిరి న్యూస్) :**

తెలంగాణ రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం సహాయ నిధులను ఎప్పటికప్పుడు మంజురు చేయడంతో నిరుపేదల ఆరోగ్యాలకు వరప్రద్దాయినిగా మారిందని గొల్లపల్లి పీఏసీఎస్ మాజీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి, మునిదేవునిపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు రూ. లక్ష 50వెల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన, నిరుపేద తరగతుల సంక్షమాలను ఆర్థికంగా, రాజకీయంగా నిలదొక్కెందుకు అనేక పథకాలు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రీయ ప్రారంభించిందన్నారు. రాష్ట్రంలో సంగారెడ్డి జిల్లా నియోజవర్గంలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు నూతన పరిశ్రమలను స్థాపనలకు శ్రీకారం చుట్టిందన్నారు.మాజీ ఎమ్మెల్యే టిపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి సహకారంతో పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా అభివృద్ధికి అంకితభావంతో సమగ్ర పాలనపై దృష్టి పెట్టారన్నారు. నమ్ముకున్న ప్రజలకు ఆపదొస్తే.. అప్పన్నహస్తంగా ఆర్థికంగా ఆదుకునే దయాశాలిగా రాష్టంలోనే జగ్గారెడ్డి పేరు మారుమోగుతుందని అభిప్రాయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సభ్యులు సత్యనారాయణ, శ్రీకాంత్, రామయ్య, నాయకులు బాలరాజు గౌడ్, నాగిరెడ్డి వెంకట్ రెడ్డి, అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురం రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం



**రామచంద్రాపురం, మార్చి 28, ( సిరి న్యూస్ ):**

సంగారెడ్డి జిల్లాలోని రామచంద్రాపురం రైల్వే స్టేషన్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, రైల్వే ట్రాక్ పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణతో కలిసి స్టేషన్‌ను సందర్శించారు. రైల్వే ట్రాక్ పరిస్థితిని పరిశీలిస్తూ, ఎంఎంటీఎస్ సేవలను ఎక్కడ వరకూ విస్తరించవచ్చనే అంశంపై అధికారులతో చర్చించారు.అదేవిధంగా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకు రైల్వే లైన్‌ను విస్తరించే అవకాశాలపై కూడా సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తక్షణమే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేసిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్







**మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి సిరి న్యూస్ మార్చి 28**




సర్దార్ పటేల్ నగర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద గత సంవత్సరం నుండి హై మస్ట్ లైట్లు(వీధి దీపాలు) పనిచేయడం లేదు. వీధి దీపాలు వెలగక పోవడం వల్ల కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ముఖ్యంగా మహిళలు చీకటి పడితే బయటికి రాలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి గారి ఆదేశాల మేరకు గత నెలలో ★మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ గారు కాలనీలో విస్తృతంగా పర్యటించారు వీధి దీపాల సమస్యను కాలనీవాసులు మాజీ కార్పొరేటర్ శ్రీ జగదీష్ గౌడ్ గారి దృష్టికి తీసుకురావడం జరిగింది.తక్షణమే వారు స్పందించి సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఈరోజు ప్రత్యేకంగా క్రేన్ వాహనాన్ని ఏర్పాటు చేశారు.విద్యుత్ శాఖ సిబ్బంది వారు ఈ రోజు సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద వీధి దీపాలను అమర్చారు.విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించినందుకు కాలనీ సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ఎమ్మెల్యే ★మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ గారికి కాలనీవాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇస్మాయిల్, నీలం సతీష్, మహేష్, కాలనీవాసులు పాల్గొన్నారు

## దుర్గ మల్లేశ్వర స్వామి దేవాలయంలో వడి బియ్యం కార్యక్రమం







**మేడ్చల్ మల్కాజ్గిరి ప్రతినిధి ( సిరి న్యూస్) మార్చ్ 28**

శ్రీసీతారాములవారి కళ్యాణం శ్రీ దుర్గమ్మలేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించబడును.సమయం: మధ్యాహ్నం 1:00 గంటలకు కాలనీ సభ్యులందరూ తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము.ధన్యవాదములతో,గ్రీన్ హిల్స్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ కమిటీ

# నిరుపయోగంగా మారిన ధోబీఘాట్





- **నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం...**

**హత్నూర, మార్చి 28,(సిరి న్యూస్)**

ధోబి ఘాట్లు నిర్మించి నీటి సౌకర్యం కల్పించలేకపోవడంతో అవి కొన్ని ఏళ్లుగా నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం శిథిలా వ్యవస్థకు చేరుకున్నాయి. రజకుల సౌకర్యార్థం కోసంహత్నూర మండలం దౌల్తాబాద్ గ్రామ పరిధిలోని చిల్మెలకుంట ప్రాంతంలో, దౌలాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని నిర్మించిన ధోబీఘాట్ నేడు పూర్తిగా నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు గ్రామంలోని 10 నుండి 15 కుటుంబాల ధోబీలకు, ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న ఎమ్మెల్యే సునీతా రెడ్డి హాయంలో నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేసి, నిర్మాణం పూర్తి చేసిన ఈ ధోబీఘాట్ ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది.లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన ఈ సౌకర్యం, సరైన నిర్వహణ లేకపోవడం, నీటి వసతి కల్పించకపోవడం కారణంగా ఉపయోగం లేకుండా పోయింది. నీరు, బోరు వేసి కరెంటు లేకపోవడంతో ధోబీలు ఇక్కడ పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో వారు మళ్లీ పాత పద్ధతులకే పరిమితమవుతున్నారు.

### నిర్వహణ లేక శిథిలావస్థ

కాలక్రమేణా ఈ ధోబీఘాట్ చుట్టుపక్కల మురికి, చెత్త పేరుకుపోయింది. ధోబి ఘాట్ భాగాలు పగుళ్లకు లోనవుతూ, భద్రతా సమస్యలకు దారితీస్తున్నాయి. ఇలాంటివి హత్నూర, చింతల్ చెరువు తోబి గట్ల పరిస్థితి ఇలానే ఉన్నాయి. నిర్వహణ బాధ్యత వహించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో, ఇది ప్రస్తుతం పనికిరాని నిర్మాణంగా మిగిలిపోయింది.

### ప్రజల ఆవేదన

గ్రామస్తులు మాట్లాడుతూ, “ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ ధోబీఘాట్ నిర్మించింది. కానీ నీటి సౌకర్యం కల్పించకపోవడం, సంరక్షణ లేకపోవడం వల్ల ఇది వృథాగా మారింది. ప్రజాధనం దుర్వినియోగమవుతోంది” అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల స్పందన ఎప్పుడు? కులవృత్తిని

గ్రామంలో ఉపాధి అవకాశం పెంచాల్సిన ఈ ధోబీఘాట్, ప్రస్తుతం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి, నీటి వసతి కల్పించి, మరమ్మతులు చేపట్టి, ధోబీఘాట్‌ను మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రజాధనానికి విలువ ఇవ్వాల్సిన అవసరం

ప్రజల అవసరాల కోసం నిర్మించిన మౌలిక వసతులు ఇలా నిరుపయోగంగా మారడం దురదృష్టకరం. పాలకులు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకుంటేనే ఇలాంటి నిర్మాణాలు ప్రజలకు నిజమైన ఉపయోగాన్ని అందించగలవు.



# నర్సాపూర్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం

- **మున్సిపల్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలి**
- **కౌన్సిలర్లు అందరూ అభివృద్ధికి సహకరించాలి**

**నర్సాపూర్ మార్చి 28 (సిరి న్యూస్)**




నర్సాపూర్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ కమిషనర్ శ్రీరామ్ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మి రాజు యాదవ్ అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించడం జరిగింది లక్ష్మీ రాజు యాదవ్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి మున్సిపల్ సభ్యులందరూ కలిసికట్టుగా ఉండి పట్టణ సమస్యలను తీర్చాలని మున్సిపల్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు ఈ సమావేశంలో కార్యాలయ నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులపై పాలకవర్గం చర్చించి పలు తీర్మానాలు చేశారు జిల్లా కలెక్టర్ & మేజిస్ట్రేట్ మెదక్, జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు, సూచనల మేరకు మున్సిపల్ 2026-27 ఆర్థిక సంవత్సరమునకు అంచనాల వార్షిక బడ్జెట్, 2025-26 ఆర్థిక సంవత్సరమునకు సవరించిన బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది ఈ బడ్జెట్ యొక్క పూర్తి ఆదాయ వ్యయాల, పద్దుల వారిగా ఆర్.సంతోషి రాణి, గణాంక అధికారి చదివి వినిపించగా కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవముగా ఆమోదిస్తూ తీర్మానం చేశారుఈ బడ్జెట్ లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆదాయ వ్యయాలు అంచనా వేసిన మొత్తం ఆదాయం (సాధారణ నిధులు , గ్రాంట్లు కలుపుకొని) - రూ.1936.95 లక్షలు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి అంచనా వేసిన మొత్తం వ్యయం గ్రాంట్లు కలుపుకొని రూ.1931.75 లక్షలు.

* 2026-27 సంవత్సరానికి అంచనా వేసిన మున్సిపల్ సాధారణ ఆదాయము- రూ.905.95 లక్షలు

* 2026-27 సంవత్సరానికి అంచనా వేసిన మున్సిపల్ సాధారణ వ్యయము - రూ.900.45 లక్షలు

* 2026-27 సంవత్సరానికి అంచనా వేసిన ఆదాయం (గ్రాంట్ల ద్వారా) - రూ. 1021.00 లక్షలు.

* 2026-27 సంవత్సరానికి అంచనా వేసిన వ్యయము (గ్రాంట్ల ద్వారా) - రూ. 969.00 లక్షలు

* 2026-27 సంవత్సరానికి గాను 10% గ్రీన్ బడ్జెట్ కొరకు కేటాయించిన సాధారణ నిధులు- రూ. 142.90 లక్షలు.

* 2026-27 ఆర్థిక సంవత్సరపు మిగులు బడ్జెట్ రూ. 26.51 లక్షలు కేటాయించారు

ఈ సమావేశములో వైస్ చైర్మన్ శ బుచ్చేష్ యాదవ్ పాలకవర్గ సభ్యులు ఎం నర్సమ్మ , అంతారం సుధీర్ గౌడ్ , అఫ్రీన్, మహమ్మద్ జరీనా బేగం, మహమ్మద్ మోహిజుద్దీన్ , చింతకుంట శ్రీకాంత్ , వంటేద్దు సునీత బాల్ రెడ్డి , కండెల రాజు మన్నే నిరంజన్ దాస్ సమీనా బేగం, దుర్గప్ప సరళ ఆంజనేయులు గౌడ్ పంబల్ల లలిత బిక్షపతి వివిధ శాఖల అధికారులు అనగా విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ రామమూర్తి ఆర్టీసీ సూపర్డెంట్ ఎం లక్ష్మణ్ , వైద్య ఆరోగ్యశాఖ సి టి ఓ సాలు బాయ్ అసిస్టెంట్ ఇంజనీర్లు రాజకుమార్, సురేష్ వివిధ శాఖల అధికారులు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎన్. కిష్టయ్య మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# సత్యమేవ జయతే

- **మాజీ మంత్రి హరీష్ రావును కలిసిన బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి**
- **అసెంబ్లీలో తనపై నమోదు చేసిన అక్రమ మైనింగ్ కేసులపై మద్దతుగా మాట్లాడినందుకు కృతజ్ఞతలు తెలిపిన గూడెం మధుసూదన్ రెడ్డి**

**పటాన్ చెరు. మార్చి 28, (సిరి న్యూస్):**



అక్రమ మైనింగ్ పేరుతో తనపైన కేసులు నమోదు చేసి అర్ధరాత్రి అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని రాష్ట్ర అసెంబ్లీలో కడిగి పారేసి.. తనకు మద్దతుగా మాట్లాడిన రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ని శనివారం సాయంత్రం హైదరాబాదులోని ఆయన నివాసంలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జి ఎం ఎస్ ఆర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాలకు ఒక న్యాయం.. అధికార పక్షానికి మరో న్యాయం అందిస్తూ.. ద్వంద వైఖరిని అవలంబిస్తుందని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున పటాన్ చెరు నియోజకవర్గ నుండి ఎమ్మెల్యే జిఎంఆర్ గారి హ్యాట్రిక్ విజయాన్ని జీర్ణించుకోలేని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కక్షపూరిత చర్యలకు పాల్పడుతూ అక్రమంగా కేసులు బనాయిస్తూ మానసిక వేదనకు గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజం నిప్పులాంటిదని.. ఏదో ఒక రోజు నిజం బయటపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పటాన్ చెరు ప్రజలు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి, బిఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే జిఎంఆర్ నాయకత్వానికి పట్టం కట్టినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు. తమ కుటుంబానికి సంపూర్ణ మద్దతు అందిస్తున్న బిఆర్ఎస్ పార్టీకి ఎల్లప్పుడూ రుణ పడి ఉంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, హరి, తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో మట్టి మ్యాజిక్





ఎండాకాలం వచ్చిందంటే చల్లని నీళ్ల కోసం అందరూ ఆరాటపడుతారు. ఎండలో గొంతు ఎండిపోతే ఒక గ్లాస్ కూల్ వాటర్ తాగితే ప్రాణం లేచి వస్తుంది. చాలామంది ఫ్రిజ్‌లో బాటిల్స్ పెట్టి నీళ్లు చల్లగా తాగుతారు. కానీ అవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు. వీటికి బదులుగా మట్టి కుండలు బెస్ట్ ఆప్షన్.మన పూర్వ కాలం నుంచి వస్తున్న సాంప్రదాయాలలో రాగి, ఇత్తడి పాత్రలను వంశ పారంపర్యంగా వాడుతూ రావడం. అయితే ఈ మధ్య కాలంలో ఆరోగ్యం మీద కలిగిన శ్రద్ధ కారణంగా మళ్ళీ అప్పటి సాంప్రదాయాలు వెలుగులోనికి వస్తున్నాయి. అయితే అందులో భాగంగా రాగి సీసాల్లో లేదా మట్టి కుండల్లో నిల్వ ఉంచిన నీటిని తాగితే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని చెబుతున్నారు.

వేసవిలో మట్టి కుండలోని నీరు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఇక వేసవిలో చాలా మంది డీహైడ్రేషన్ బారిన పడుతుంటారు. కాగా, మట్టి కుండలోని నీరు ఆ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాకుండా ఎండ తాపానికి చర్మం జిడ్డుగా, మొటిమలు వంటి సమస్యలు వస్తాయి. మట్టి కుండలోని నీరు తాగడం వలన వాటి నుంచి కూడా ఉపశమనం పొందవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కుండలో నీరు సహజంగానే చల్లగా ఉండటమే కాకుండా రుచిగా ఉంటాయి. వేసవిలో గ్యాస్ అసిడిటీ లాంటి సమస్యలు ఇబ్బంది పెడతాయి. అయితే కుండ నీరు తాగడం వలన వాటి నుంచి విముక్తి పొందవచ్చును. అలాగే శ్వాస కోశ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఈ కుండలు బాష్పీభవన సూత్రంపై పనిచేస్తాయి. మట్టి కుండ పోరస్‌గా ఉన్నందున, అది నీటిని క్రమంగా చల్లబరుస్తుంది. ఇది మరే ఇతర కంటైనర్‌లో లేని నాణ్యతను కలిగి ఉంటాయి. కుండనీరు మాత్రం వేసవిలో సరైన త్రాగునీటిని అందిస్తుంది. దాని సంపూర్ణ శీతలీకరణ ప్రభావంతో, ఇది గొంతుపై సున్నితంగా పనిచేస్తుంది. జలుబు, దగ్గుతో బాధపడుతున్న వారికి కూడా సులభంగా ఉపశమనాన్ని అందిస్తుంది. వడదెబ్బ అనేది వేసవిలో చాలా మందిని వేధించే చాలా సాధారణ సమస్య. మట్టి కుండలలో నిల్వ చేయబడిన నీటిలో విటమిన్లు, ఖనిజాలు శరీరంలోని గ్లూకోజ్ స్థాయిలను నిర్వహించడంలో సహాయపడతాయి. శరీరానికి సున్నితమైన శీతలీకరణ ప్రభావాన్ని కూడా అందిస్తాయి.

అయితే..ఈ మట్టి కుండలో కూడా రెండు రకాలు ఉన్నాయి. ఎరుపు, నలుపు రంగుల్లో మట్టి కుండలు అందుబాటులో ఉన్నాయి. చాలామంది ప్రజలు ఎర్ర మట్టి కుండను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇది టెర్రకోట బంకమట్టితో తయారు చేస్తారు. నల్ల కుండను నల్ల మట్టి, పొగతో కాల్చటం ద్వారా తయారు చేస్తారు. దీని నిర్మాణం



నీటిని ఎక్కువసేపు చల్లగా ఉంచుతుంది. దీనిని కార్బోనైజ్డ్ క్లే పాట్ అని కూడా అంటారు. నల్ల కుండ ఉపరితలంపై ఆల్గే, బ్యాక్టీరియా త్వరగా పెరగవు. కాబట్టి నీరు ఎక్కువ సమయం పాటు తాజాగా ఉంటుంది. త్వరగా చల్లటి నీరు అవసరమైతే ఎర్రమట్టితో చేసిన కుండ ఉత్తమం. కానీ నీటిని ఎక్కువసేపు చల్లగా ఉంచాలనుకుంటే నల్లటి కుండ మంచిదని నిపుణులు చెబుతున్నారు.



# గాల్లో ఎగిరే చేపల గురించి విన్నారా..?

**ఈ ప్రపంచం ఒక అద్భుతాల గని. ప్రకృతి అంతులేని వింతలు.. విశేషాలకు నెలవు. మనకు తెలియని ఎన్నో వింతలు విశేషాలు ఈ భూమండలంపై దాగి ఉన్నాయి. అందులో ఒక్కటే ఇప్పుడు చెప్పబోయేది. చేపలు నీటిలో జీవించే జలచర జీవులని మనకి తెలుసు. అందుకే ఎవరైనా వచ్చి చేపలు గాల్లో ఎగురుతున్నాయని చెబితే అస్సలు నమ్మం. కానీ, ఎగిరే చేపలు కూడా ఉన్నాయి. అదే వాటి ప్రత్యేకత. వీటిని ఫ్లైయింగ్ ఫిష్ అంటారు.**

వీటికి ఫ్లైయింగ్ ఫిష్, ఫ్లైయింగ్ కాడ్, కొల్లోక్వియల్లి అని రకరకాల పేర్లు ఉన్నాయి. ఇవి సముద్రాల్లో పెరుగుతాయి. వీటిలో దాదాపు 64 రకాల జాతులున్నాయి. సాధారణంగా చేపలకు నీటిలో ఈదడానికి వీలుగా పలుచని రెక్కలులాంటివి ఉంటాయి. ఈ చేపలకు మాత్రం విసనకర్ర లాంటి పెద్ద రెక్కలు ఉంటాయి. తమకు ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు ఇవి ఒక్కసారిగా నీళ్లల్లోంచి పైకి ఎగురుతాయి. ఆ సమయంలో వాటి రెక్కలను పక్షుల రెక్కల లాగా విచ్చుకునేలా చేస్తాయి. కానీ, పక్షుల లాగా రెక్కలను పైకీ, కిందకి ఆడించలేవు. ఒక్కసారి దూసుకెళ్లినప్పుడు గాల్లో ఎంత దూరం వెళ్లగలవో అంత దూరం వెళ్లి.. తర్వాత తిరిగి నీటిలోకి జారుకుంటాయి.

ఈ చేపల్ని చూడాలంటే దక్షిణ అమెరికా పక్కన ఉండే కరీబియన్ దీవుల్లోని బార్బడోస్‌లో ఎక్కువగా కనిపిస్తాయి. అందుకే ఆ దేశాన్ని ఎగిరే చేపల భూమి అని పిలుస్తారు. అంతేకాదు ఆ దేశ జాతీయ చిహ్నాల్లో ఈ చేప కూడా ఒకటి. ఈ చేపలు పురాతనమైనవి కూడా. వీటిలో అతి ప్రాచీన చేప శిలాజం 24 కోట్ల సంవత్సరాల కిందటిదిగా గుర్తించారు. అప్పట్లో ఫ్లైయింగ్ ఫిష్ లకూ ఇప్పుడు మనం చూసే ఫ్లైయింగ్ ఫిష్ లకూ ఆకారంలో చాలా మార్పులొచ్చాయని శాస్త్రవేత్తలు తెలిపారు.




మరి ఈ చేపలను తినరా అనే డౌట్ అందరికీ రావొచ్చు. ఈ ఫ్లైయింగ్ ఫిష్‌ను కూడా తినొచ్చు. కానీ వీటిని పట్టుకున్న వెంటనే వండుకొని తినేయ్యాలట.. లైట్ల సాయంతో వీటిని పట్టుకోవడం సులువట. ఇవి ఉష్ణమండల, సమశీతోష్ణ సముద్ర జాతులకు చెందిన చేపలు. అట్లాంటిక్, పసిఫిక్ సముద్ర తీరాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. ఇటీవల వీటి గమనం బంగాళాఖాతంలోనూ కనిపిస్తోంది. భారత్, బంగ్లాదేశ్, జపాన్, వియత్నాం, ఇండోనేషియా, తైవాన్, చైనా, వెనిజులా, బార్బడోస్ జలాల్లో ఎగిరే చేపలు ఉన్నాయి. మాల్దీవులు, చెన్నయ్ తీరాల్లోనూ ఇవి తరచూ కనిపిస్తూ ఉంటాయి.



## ధురంధర్ ఒక చెత్త సినిమా..

# అసదుద్దీన్ ఓవైసీ కామెంట్స్..





భారత్‌తో పాటు ప్రపంచదేశాల్లో ''ధురంధర్2'' హవా కొనసాగుతోంది. కలెక్షన్లతో రికార్డులు కొల్లగొడుతోంది. సినిమాపై చాలా మంది ప్రశంసలు కురిపిస్తుండగా, మరోవైపు ఈ సినిమాను విమర్శించే వారు కూడా ఉన్నారు. తాజాగా విమర్శకులు జాబితాలో ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ కూడా చేరారు. టైమ్స్ నౌ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ధురంధర్ 2 సినిమాను ''బక్వాస్''( చెత్తసినిమా)గా అభివర్ణించారు. సినిమా హింసను ప్రోత్సహిస్తోందని విమర్శించారు. ''అది అసలు సినిమానా?'' అని ప్రశ్నించారు. మూడు గంటలు అర్థం లేని గారడీ అంటూ కొట్టిపారేశారు.
ఆదిత్య ధర్ నిర్మించిన, రణవీర్ సింగ్ నటించిన ఈ సినిమా భారీ సక్సెస్ సాధించిన తరుణంలో ఓవైసీ నుంచి ఈ వ్యాఖ్యలు వచ్చాయి. ''మూడు గంటలు ఈ సినిమాను చూసేందుకు తనకు సమయం లేదని, ఈ సినిమా ఏం మేసేజ్ ఇస్తుందని, ముస్లింలపై సందేహాలు రెకెత్తించేలా సినిమా రూపొందిచారు'' అని ఆయన అన్నారు. ఇలాంటి సినిమాలపై దృష్టి పెట్టడం కన్నా వాటిని పట్టించుకోకపోవడానికే ప్రాధాన్యత ఇస్తానని ఓవైసీ అన్నారు.
స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందించిన సినిమా పాకిస్తాన్ బ్యాక్‌డ్రాప్‌గా కొనసాగుతుంది. కరాచీ లోని నేరసామ్రాజ్యం లోని ఇండియన్ ఏజెంట్ ఎంటరవ్వడం, అక్కడి మాఫియాను శాసించడం వంటి అంశాలు ఈ సినిమాలో ఉంటాయి. IC 814 హైజాకింగ్, భారత పార్లమెంట్ దాడి మరియు ముంబై దాడులు వంటి నిజ జీవిత సంఘటనలు కూడా ఇందులో కనిపిస్తాయి. జియో స్టూడియోస్ మరియు బి62 స్టూడియోస్ నిర్మించిన 'ధురందర్ 2' మార్చి 19న విడుదలైంది. ఈ చిత్రం భారతదేశంలో రూ. 715.72 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,128 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం.గత ఏడాది డిసెంబర్‌లో విడుదలైన ఒరిజినల్ 'ధురందర్' దేశీయంగా రూ. 840 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా రూ. 1,300 కోట్లకు పైగా వసూలు చేసి, సీక్వెల్‌పై భారీ అంచనాలను నెలకొల్పింది.



## పెళ్లి కాలేదని చెప్పి ప్రియురాలితో గోవాలో ల్యాండ్ కొన్న స్టార్ హీరో?

కోలీవుడ్ స్టార్ హీరో జయం రవి, ఆయన భార్య ఆర్తీల విడాకుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది, నిన్నటి వరకు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్న ఈ మాజీ జంట వ్యవహారంలోకి ఇప్పుడు గోవా ల్యాండ్ ఇష్యూతో పాటుగా దళపతి విజయ్ పేరు కూడా చేరడంతో సోషల్ మీడియాలో చర్చలు ఊపందుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం.. జయం రవి తన సన్నిహితురాలు, సింగర్ కెనిషా ఫ్రాన్సిస్‌తో కలిసి గోవాలో సుమారు రూ. 42 లక్షల విలువైన భూమిని కొనుగోలు చేసినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఆ భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాల్లో జయం రవి తన వైవాహిక స్థితి దగ్గర 'అన్‌మ్యారీడ్' అని పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆర్తీతో ఇంకా చట్టబద్ధంగా విడాకులు రాకముందే, కోర్టులో కేసు నడుస్తుండగానే రవి ఇలా ఎలా పేర్కొంటారని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఒక రిసెప్షన్ వేడుకలో దళపతి విజయ్, త్రిష ఒకే రంగు దుస్తుల్లో మెరవడం కోలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది, సరిగ్గా ఇదే తరహాలో గతంలో జయం రవి, కెనిషా కూడా ఒకే కలర్ డ్రెస్సుల్లో కనిపించిన వీడియోలను నెటిజన్లు ఇప్పుడు బయటకు తీస్తున్నారు. విజయ్‌త్రిషల గురించి ఇంతగా మాట్లాడుతున్న జనం, గత ఏడాది జయం రవి విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని ఆర్తీ పరోక్షంగా ప్రశ్నించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఆర్తీ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. "ఒక స్త్రీ గౌరవం అనేది ఆమె భర్త ఇచ్చే విలువపై ఆధారపడి ఉండకూడదు. పోయిన ఏడాది ఇలాంటిదే జరిగినప్పుడు ఎవరూ మాట్లాడలేదు, ఇప్పుడెందుకు ఇంతలా చర్చిస్తున్నారు?" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కెనిషాను తన 'కంపానియన్' అని చెప్పుకుంటూ పార్టీలు, ఫంక్షన్లకు తీసుకెళ్తున్న జయం రవి, మరోవైపు భూమి పత్రాల్లో 'అన్‌మ్యారీడ్' అని పేర్కొనడంపై ఆయన నుండి ఎలాంటి వివరణ వస్తుందో వేచి చూడాలి.

# పెద్ది కోసం వెనక్కి తగ్గిన అయ్యగారు!



అక్కినేని అఖిల్ హీరోగా, మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వంలో 'లెనిన్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. సితార నాగవంశీ నిర్మిస్తున్న ఈ సినిమా వాస్తవానికి మే 1వ తేదీన రిలీజ్ కావాల్సి ఉంది. అయితే, తాజాగా ఈ సినిమా రిలీజ్ పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు.
రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' ఏప్రిల్ 30వ తేదీన రిలీజ్ అవుతుంది. ఈ నేపథ్యంలో ఆ సినిమాని సెలబ్రేట్ చేసుకోవడమే కరెక్ట్. అక్కినేని అఖిల్‌కి రామ్ చరణ్‌తో మంచి అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన మీద ఉన్న గౌరవంతో 'లెనిన్' వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సినిమా 26 జూన్, 2026వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లుగా ప్రకటించారు. కచ్చితంగా ఈ సినిమా ఒక సెలబ్రేషన్ లా ఉంటుందని, ప్రతి ఎమోషన్ సహా అన్ని విషయాలు ఆకట్టుకునేలా ఉంటాయని పేర్కొన్నారు. ఇక ఈ సినిమాని అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్న ఈ సినిమాకి అవినాష్ కొల్ల ఆర్ట్ డైరెక్టర్‌గా వివరిస్తున్నారు. ఇక ఈ సినిమాకి తమన్ సంగీతం అందిస్తున్నారు.




## ప్రాణాలకు తెగించి బైకర్ షూటింగ్.. శర్వా అయితే 23 కిలోల వెయిట్ లాస్!

శర్వా, అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హైఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ డాల్బీ సినిమా, EPIQ, 4DX, PCX వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. ఇప్పటికే గ్లింప్స్‌లు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్ రెడ్డి కంకర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**బైకర్ ఆడియన్స్‌కు ఎలాంటి ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది?**

బైకర్ 100% థియేటర్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. డాల్బీ విజన్‌లో కూడా షూట్ చేశాం. ట్రైలర్ చూసిన ప్రతి ఒక్కరూ ఈ సినిమా సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతున్నారు. ఖచ్చితంగా ఈ సినిమా థియేటర్‌లో చాలా మంచి ఎక్స్‌పీరియన్స్ ఉంటుంది.

**ఈ కథ రాయడానికి ఇన్స్పిరేషన్?**

బైక్ అనేది అందరికీ ఒక ఎమోషన్. నాకు పర్సనల్‌గా ఆ ఎమోషన్ అంటే చాలా ఇష్టం. ఇందులో రేసింగ్‌తో పాటు చాలా మంచి ఫ్యామిలీ ఎమోషన్ ఉంది. ఫాదర్‌సన్ మధ్య ఉండే ఎమోషన్ ఆడియన్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది.

**షూటింగ్‌లో మీరు ఎదుర్కొన్న చాలెంజెస్ ఏమిటి?**

ఈ సినిమాలో రేసింగ్ సీక్వెన్స్‌లను రియల్ రేసర్స్‌తో షూట్ చేశాం. షూట్ చేసినప్పుడు చాలా యాక్సిడెంట్లు జరిగాయి. ఒక షాట్ చేసిన తర్వాత రెండు గంటలు బ్రేక్ ఇవ్వాల్సి వచ్చేది. కేవలం యాక్షన్‌కే 60 రోజులకు పైగా పట్టింది.
ఈ సినిమా రెండు టైమ్‌లైన్స్‌లో జరుగుతుంది. 90స్‌లో టూ స్ట్రోక్ బైక్స్ ఉండేవి, అవి ఇప్పుడు లేవు. వాటిని డిజైన్ చేయడానికి చాలా టైం పట్టింది. ఇందులో రేసింగ్ ఇండోనేషియాలో షూట్ చేశాం. ఆ బైక్స్ అన్నీ మళ్లీ ఇండియాకు తీసుకురావడం కూడా చాలా పెద్ద ప్రాసెస్. అలాగే ఈ సినిమా కోసం న్యూజీలాండ్, ఆస్ట్రేలియా నుంచి రేసర్స్ ని రప్పించాము.

**ఇండియాలో ఈ స్పోర్ట్స్ ఉందా?**

ఉంది. కానీ రావాల్సిన పాపులరిటీ రాలేదు. ఇందులో రాజశేఖర్ గారి క్యారెక్టర్‌తో ఇదే అంశాన్ని ప్రెజెంట్ చేస్తున్నాం. ఇండియాలో శ్యామ్ కొఠారి అనే వెటరన్ రేసర్ ఉన్నారు. కానీ ఆయనకి క్రికెట్‌లో కపిల్ దేవ్‌కి వచ్చినంత గుర్తింపు రేసింగ్‌లో రాలేదు.ఈ రేసింగ్ స్పోర్ట్ మనకి ఎప్పటినుంచో ఉంది, కాకపోతే ఇందులో కొంచెం రిస్క్ ఎక్కువ. కపిల్ దేవ్‌కి ఉన్నంత గుర్తింపు శ్యామ్ కొఠారికి కూడా రావాలనేదే నా మోటివ్. ఇది ఫిక్షనల్ స్టోరీ అయినప్పటికీ రేసింగ్ విషయంలో కొన్ని ట్రూ ఇన్సిడెంట్‌స్‌ను ఇన్స్పిరేషన్‌గా తీసుకున్నాం.
రాజశేఖర్ గారు కోచ్ అలాగే ఫాదర్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఆయన క్యారెక్టర్ రెగ్యులర్ ఫాదర్‌లా ఉండదు. ఆయన చుట్టూ ఒక కథ తిరుగుతుంది. ఆయన ఆ క్యారెక్టర్ చేయడంతో ఎమోషన్ ఇంకా స్ట్రాంగ్ అయ్యింది.
ఎఫ్ వన్ చూసిన ఆడియన్స్‌కి ఈ సినిమా ఎలాంటి కొత్తదనం ఇస్తుంది?
ఎఫ్ వన్ సినిమా రిలీజ్ అయినప్పటికీ నా సినిమా పూర్తి అయిపోయి పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది. ఎమోషన్, డ్రామా పరంగా రెండు కూడా చాలా డిఫరెంట్ సినిమాలు.

**ఇలాంటి సినిమాలు తీయాలంటే నిర్మాతల సపోర్ట్ చాలా ఉండాలి కదా?**

యూవీ క్రియేషన్స్‌లో చేసిన ప్రతి సినిమా విజువల్‌గా, టెక్నికల్‌గా చాలా గ్రాండ్‌గా ఉంటుంది. కథ నచ్చితే ఆ కథ కోసం ఎక్కడా రాజీ పడకుండా ఖర్చు చేస్తారు.
ఇండోనేషియాలో ఈ సినిమా క్లైమాక్స్‌ను షూట్ చేశాం. అక్కడ రేసింగ్ షూట్ చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఇంటర్నేషనల్ అసోసియేషన్స్ వాళ్లే అక్కడ వద్దనుకున్నారు. అలాంటి లోకేషన్‌లో మేము సెట్ వేసి మరీ చేశాం. ఎందుకంటే ఈ కథకి అలాంటి ప్రాంతం కావాలి.

**శర్వానంద్ గారు ట్రాన్స్‌ఫర్మేషన్ చాలా సర్ప్రైజ్‌గా ఉంది కదా. ఈ క్యారెక్టర్ విషయంలో ఆయన ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**

ఈ సినిమా కోసం ఆయన దాదాపుగా 23 కేజీలు తగ్గారు. కథ చెప్పినప్పుడే బైకర్ క్యారెక్టర్ ఇలా ఉండాలి అని మేము ఫిక్స్ అయ్యాము. ఆయన ఈ సినిమా కోసం దాదాపు 6 నెలలు బ్రేక్ తీసుకుని ఫిజికల్‌గా, మెంటల్‌గా ప్రిపేర్ అయ్యారు. ఈ సినిమాలో ఆయన పెర్ఫార్మెన్స్ టెర్రిఫిక్‌గా ఉంటుంది. శర్వా గారు ఈ సినిమాను తన కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ అని చెప్పారు. సినిమాపై ఆయనకున్న నమ్మకంతోనే ఖచ్చితంగా బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం అని చెప్పారు.
ఈ సినిమా చూసి బయటకు వచ్చినప్పుడు అందరిలో ఒక మంచి ఫీలింగ్ ఉంటుంది. శర్వానంద్ గారు, రాజశేఖర్ గారు, నిర్మాతలు అందరి నమ్మకం వల్లే ఈ సినిమా ఇంత అద్భుతంగా వచ్చింది.



## పెళ్లి తర్వాత సమంతలో కొత్త కళ?

**టాలీవుడ్ స్టార్ బ్యూటీ సమంత జీవితం గత కొన్నేళ్లుగా ఒక రోలర్ కోస్టర్ రైడ్‌లా సాగింది, నాగచైతన్యతో విడాకుల తర్వాత ఆమె ఎదుర్కొన్న పరిస్థితులు వర్ణనాతీతం. అటు వ్యక్తిగత బాధ, ఇటు మయోసైటిస్ వంటి అరుదైన వ్యాధి.. వెరసి సమంత శారీరకంగా, మానసికగా ఎంతో కుంగిపోయింది. ముఖంలో ఆ పాత చమక్కుపోయిందని, వరుస ఫ్లాపులతో కెరీర్ కూడా డల్ అయిపోయిందని విమర్శలు వచ్చాయి. కానీ, ఇప్పుడు సీన్ పూర్తిగా మారిపోయింది, విడాకుల చేదు జ్ఞాపకాలను చెరిపేస్తూ, రాజ్‌ను పెళ్లి చేసుకున్న తర్వాత సమంతలో మళ్ళీ పాత 'చలాకీ'తనం కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె ఫుల్ హ్యాపీ మూడ్‌లో ఉంది, కేవలం భార్యగానే కాకుండా, నిర్మాతగా కూడా కొత్త అవతారమెత్తి 'శుభం' అనే సినిమాను అందించింది. ఇప్పుడు ఆమె నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రానికి భర్త రాజ్ స్వయంగా నిర్మాతగా వ్యవహరిస్తుండటం విశేషం. హోళీ, ఉగాది వేడుకల్లో ఆమె సందడి చూస్తుంటే, సమంత మళ్ళీ తన పూర్వ-వైభవాన్ని సంతరించుకుందని అర్థమవుతోంది. ఇటీవల జరిగిన 'ఉమెన్ ఇన్ ఎంటర్‌టైన్‌మెంట్' ఈవెంట్‌లో పాల్గొన్న సమంత, మహిళల మనస్తత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. మహిళల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తగ్గడానికి ప్రధాన కారణం 'సారీ' అని ఆమె పేర్కొంది. "పురుషులతో పోలిస్తే మహిళలే ప్రతి చిన్న విషయానికీ అనవసరంగా సారీ చెబుతుంటారు. అలా పదే పదే క్షమాపణలు కోరడం వల్ల తెలియకుండానే మన ఆత్మవిశ్వాసం దెబ్బతింటుంది. అవసరం లేని చోట సారీ చెప్పాల్సిన పని లేదు" అంటూ సామ్ ఇచ్చిన స్పీచ్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.**

Published by **Badhe Jayasree** on behalf of **Siri Media**. Published at Flat No. 104, Kapil Kausalya Apartment, Shilpa Cereny County Vencher, Near MBR Garden, Pothireddypally X Road, Sangareddy, Telangana State - 502201. Phone : **9697889922**. E-Mail : **siridailynews@gmail.com**.